పెన్ పవర్
తెలంగాణ రౌండప్




గాగిల్లాపూర్‌లో ప్రజల కోసం కేటాయించిన 25 అడుగుల రహదారి ఆక్రమణలు.. అధికారుల నిర్లక్ష్యానికి నడుమ తెరలేపిన వ్యవహారం ఇది.. రోడ్డు హద్దులు కళ్లముందే ఉన్నా.. నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ.. బాధితులు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.. కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదుతో, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో చివరకు లోకాయుక్తను ఆశ్రయించాల్సి వచ్చిందని బాధితులు చెబుతున్నారు.. ఒకవైపు 2024 లోనే అక్రమ నిర్మాణాన్ని తొలగించామని మున్సిపాలిటీ లోకాయుక్తకు నివేదిక ఇవ్వగా..!మరోవైపు 2025లో మళ్లీ అదే రహదారి ఆక్రమణపై ఫిర్యాదు రావడం, అధికారుల పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు రేపుతోంది.. చివరికి శనివారం లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ డిప్యూటీ డైరెక్టర్ పి.జైపాల్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్డు ఆక్రమణలను పరిశీలించడం, ఈ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది.. దీంతో దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది..

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 4:



గాగిల్లాపూర్‌లో రోడ్డు ఆక్రమణ పరిశీలనలో లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్..

# 25 అడుగుల రోడ్డును.. 12 అడుగులకు కుదించారు..!

## కలెక్టర్ ఆదేశాలూ లెక్కచేయలేదు..! లోకాయుక్త సందర్శించక తప్పలేదు..!

- గాగిల్లాపూర్‌లో 25 అడుగుల రోడ్డు ఆక్రమణపై రంగంలోకి లోకాయుక్త..!
- క్షేత్రస్థాయిలో లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ డిప్యూటీ డైరెక్టర్ పి. జైపాల్ పరిశీలన..!
- సర్వే నెంబర్లు 185, 186లో రోడ్డు ఆక్రమణలపై అధికారులతో కలిసి తనిఖీ..!
- అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశించినట్టు సమాచారం..!
- చర్యలకు కలెక్టర్ ఆదేశాలున్నా.. కదలని మున్సిపల్ యంత్రాంగంపై ప్రశ్నలు..!
- మున్సిపల్ అధికారులపైనా ముడుపుల ఆరోపణలు..!అందుకే చర్యలు లేవా..?
- 25 అడుగుల రోడ్డు కాస్త 12 అడుగులకు కుదించేశారంటూ బాధితుల ఆవేదన..
- బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలోనూ ఇదే తరహా రోడ్డు ఆక్రమణకు మున్సిపల్ అండ..
- ఫిర్యాదు చేసినప్పటికీ యధేచ్ఛగా పనులు.. పుట్టింగ్‌ల నుంచి రెండు అంతస్తుల వరకు..
- 2024లో తొలగించామని ఉత్తుత్తి నివేదిక.. మళ్లీ ఆక్రమణలపై ఫిర్యాదు..!
- హైటెన్షన్ విద్యుత్ లైన్ కిందనే అక్రమ నిర్మాణాలపై తీవ్ర విమర్శలు..!
- దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ అంటేనే.. కరప్షన్‌కు అడ్డాగా విమర్శలు..


నోటరీచేసి విక్రయించిన రోడ్డు స్థలం ఆక్రమణ..

- గాగిల్లాపూర్‌లో కబ్జాదారుల దూకుడు.. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం..!
- సుమారు ఎనిమిదేళ్ళుగా ఈ రోడ్డు కబ్జాపై పోరాటం చేస్తున్నామన్న బాధితులు..
- బాధితుల ఫిర్యాదుతో లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ పి.జైపాల్ పరిశీలన..!
- దుండిగల్ మున్సిపల్ అధికారుల మౌనంపై లేవనెత్తుతున్న ప్రశ్నలు..!?
- రోడ్డు కబ్జా కనిపించలేదా..? లేక కనిపించినా పట్టించుకోలేదా..? తాంబూలం అడ్డొచ్చిందా..?


Prajavani Acknowledgement Receipt

| | |
|---|---|
| Name | :V.Joythi |
| Mobile No. | : 8143668357 |
| Address | :Gagilapur,Gagilapur,Gagilapur |
| Village | :GAGILAPUR |
| Mandal | :DUNDIGAL GANDIMAISAMMA |
| Grievance Subject | :Requests |

Your Grievance is Registered vide Registration no.MCGMD/E/2025/00053 On 01/09/2025
Please keep the registration number for all future correspondence. Your Grievance is sent to MC Dundigal

MC Dundigal
Get the enchroachment removed

https://cpgrams.ts.nic.in/citizen/printacknowledgement.php?TabID=A

-4లో

2025 సెప్టెంబర్ 1న కలెక్టరేట్ ప్రజావాణి ఫిర్యాదుతో.. చర్యలకు కలెక్టర్ ఆదేశాలు..



చర్యలకు ఆదేశించినది చూడవచ్చు..




# పాల సహకార సంఘాల బలోపేతానికి కేంద్రం కృషి

## కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో పాల సహకార సంఘాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మెదక్ జిల్లా తూప్రాన్ పురపాలిక పరిధి బ్రాహ్మణపల్లి శివారులో అమూల్ సంస్థ రూ.400 కోట్లతో నిర్మించతలపెట్టిన మిల్క్ బల్క్ యూనిట్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, ఎంపీ రఘునందన్‌రావులతో కలిసి కిషన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడూ లేనట్లుగా ప్రధాని మోదీ కో–ఆపరేటివ్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారన్నారు. దేశంలో 75 వేల పాల సహకార సంఘాలు, రాష్ట్రంలో కొత్తగా 1,025 సంఘాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. డెయిరీ యూనిట్ ఏర్పాటుతో రాష్ట్రంలోని అన్ని వర్గాల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. శ్వేత విప్లవంలో తెలంగాణ కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఎల్‌నినో నేపథ్యంలో రైతులు పాడి పరిశ్రమ ద్వారా ప్రత్యామ్నాయ ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు కొత్త మున్సిపల్ చట్టం.. ఇక సేవలు మరింత సులభం




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగర పాలనలో కీలక మార్పులకు ప్రభుత్వం కొత్త మున్సిపల్ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. నగర విస్తరణ, పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్, వరదలు, కాలుష్యం, చెరువులు––నాలాల పరిరక్షణ వంటి అంశాలకు అనుగుణంగా కొత్త పాలనా విధానాన్ని రూపొందించారు.

ముఖ్యమంత్రి అధ్యక్షతన క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్ పనిచేయనుంది. కార్పొరేషన్లు, పోలీస్, రెవెన్యూ, హెచ్ఎండీఏ, జలమండలి, విద్యుత్, మెట్రో, ఆర్టీసీ, హైడ్రా తదితర విభాగాలు ఒకే వేదికపై సమన్వయంతో నిర్ణయాలు తీసుకునే విధానం అందుబాటులోకి రానుంది.

**రిజిస్ట్రేషన్‌తోనే మ్యుటేషన్**

ఇక ఇంటి రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మ్యుటేషన్ కోసం ప్రత్యేకంగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గనుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియతోనే మ్యుటేషన్ ఆటోమేటిక్‌గా జరిగే విధానం తీసుకొచ్చారు. ప్రతి ఆస్తికి ప్రత్యేక ఇంటిగ్రేటెడ్ ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్ కేటాయిస్తారు.

ఆస్తిపన్ను, నీటి బిల్లు, మురుగునీటి ఛార్జీలు, పారిశుద్ధ్య బకాయిలను కలిపి ఒకే బిల్లుగా అందించే విధానం కూడా రానుంది. మున్సిపల్ సేవలు, అనుమతులు, లైసెన్సులు ఒకే పోర్టల్ ద్వారా పొందే అవకాశం కల్పించనున్నారు.

-5లో

# మల్లన్నసాగర్ నీటిని ఎలా తరలిస్తారు?

## ముందుగా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి: హరీశ్‌రావు




**హైదరాబాద్ పెన్ పవర్:** మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి హైదరాబాద్‌కు 20 టీఎంసీల నీటిని ఎలా తరలిస్తారని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముందుగా నిర్వాసితుల పెండింగ్ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆదివారం తురకకాశ కుటుంబాలకు రాతికోత యంత్రాలు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నిర్వాసితుల పక్షాన దీక్ష చేసిన రేవంత్‌రెడ్డి, తాము అధికారంలోకి వస్తే రెట్టింపు పరిహారం ఇస్తామని ప్రకటించారని, అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నా ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. నిర్వాసితుల కోసం మాజీ సీఎం కేసీఆర్ పెద్ద మనసు చేసుకుని ప్రతి కుటుంబానికి 250 గజాల స్థలంలో రూ.5.04 లక్షలతో ఇళ్లు కట్టించారన్నారు. ప్రస్తుతం పదిపైసల వంతు మాత్రమే పనులు మిగిలాయని వాటిని పూర్తి చేసేందుకు రేవంత్‌రెడ్డికి చేతులు రావడం లేదని విమర్శించారు.

# 25 అడుగుల రోడ్డును.. 12 అడుగులకు కుదించారు..!



BEFORE THE HON'BLE LOKAYUKTA OF TELANGANA AT HYDERABAD
PRESENT: SRI JUSTICE C.V.RAMULU, LOKAYUKTA OF TELANGANA
FRIDAY, THE 22ND DAY OF NOVEMBER, 2024

COMPLAINT No. 1192/2023/B1

BETWEEN

Sri Vutukuri Jyothi, W/o. V.Shiva Nageshwara Rao, aged 36 years, R/o H.No.2-62/6/1, Gagillapur Village, Gandi Maisamma Dundigal Mandal, Medchal-Malkajgiri District-500043.

...Complainant

AND

1. The District Collector, Medchal-Malkajgiri District.
2. The Additional Collector, Medchal-Malkajgiri District.
3. The Chairman, Dundigal Municipality, Medchal-Malkajgiri District.
4. The Commissioner, Dundigal Municipality, Medchal-Malkajgiri District.

...Public servants

***

ORDER:

This is a complaint filed by Smt. Vukukuri Jyothi, resident of Medchal Malkajgiri District, requesting to take action by removing illegal constructions made on 25'-0" road by one Mr. J. Ravinder and Mr. Kunti Allaiah, situated in 27th Ward under Survey Nos. 185, 186 of Gagillapur Village, Medchal Malkajgiri District.

There is no necessity of going into all the details. Today, Mr. P.H.P. Sai, the [illegible] Standing Counsel for Dundigal Municipality is present and stated that the [illegible]uction created / wall constructed by Mr. J. Ravinder and Mr. Kunti Allaiah has [illegible] found to be illegal. As such, the said illegal constructions i.e., encroachment [illegible] have been demolished and removed on 19.11.2024. To that extent, a [illegible] dated 20.11.2024 has been filed and photographs have been enclosed.

In view of the above, nothing remains in this case for further enquiry. Accordingly, the case stands closed.

Sd/-
Lokayukta

T/C
Registrar

రోడ్డు ఆక్రమణలను తొలగించామని, కేసును క్లోజ్ చేయమని నివేదిక..



రోడ్డు ఆక్రమణపై బాధితులు ఫిర్యాదు చేసిన..(ఫైల్‌ఫోటో)



కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న రోడ్డుకు సంబంధించిన లేఅవుట్ కాపీ..

## అవినీతిపై విచారణ జరగాలి: బాధితులు..

25 అడుగుల రోడ్డు 12 అడుగులకు కుదించుకుపోయింది. కలెక్టర్‌కు, ప్రజావాణిలో, గవర్నర్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు.. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే లోకాయుక్తను కూడా, ఆశ్రయించాల్సి వచ్చిందని బాధితులు వాపోతున్నారు.. ఇప్పుడు లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ స్వయంగా పరిశీలించడంతో అయినా, రహదారి ఆక్రమణలు పూర్తిగా తొలగించాలని కోరుతున్నామని స్థానికుడు శివ నాగేశ్వరరావు తెలిపారు..రోడ్డు ఆక్రమణల విషయంలో అధికారుల నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరిపించాలని బాధితులు కోరుతున్నారు..

## లోకాయుక్త పర్యటనతో కదిలిన వ్యవహారం..

ఇప్పటికే పలు స్థాయిల్లో ఫిర్యాదులు, అధికారిక నివేదికలు, లోకాయుక్త విచారణ జరిగిన నేపథ్యంలో.. తాజాగా లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ డిప్యూటీ డైరెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రహదారి వాస్తవ వెడల్పు, నిర్మాణాల హద్దులు, గతంలో తొలగించినట్లు పేర్కొన్న ఆక్రమణలు, ప్రస్తుతం ఉన్న నిర్మాణాల పరిస్థితిపై అధికారుల నుంచి వివరాలు తీసుకున్నట్లు సమాచారం.. ఈ సందర్భంగా అక్రమ నిర్మాణాలను తొలగించి రహదారిని పూర్వస్థితికి తీసుకురావాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది..

- 3 పేజి తరువాయి

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్–59 పరిధిలోని, గాగిల్లాపూర్‌లో 25 అడుగుల రహదారి ఆక్రమణల వ్యవహారం చివరికి లోకాయుక్త దృష్టికి చేరింది.. స్థానికుల ఫిర్యాదులపై స్పందించిన లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ డిప్యూటీ డైరెక్టర్ పి. జైపాల్ శనివారం గాగిల్లాపూర్‌లో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు.. దుండిగల్ సర్కిల్ పరిధి గాగిల్లాపూర్ సర్వే నెంబర్లు 185, 186లో 25 అడుగుల రోడ్డును ఆక్రమించి చేపట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్మాణాలను స్థానిక మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు.. రోడ్డు హద్దులు, నిర్మాణాలను ఆయన పరిశీలించారు.. రహదారిని ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం..

25 అడుగుల రోడ్డు, ఆక్రమణకు గురై 12 అడుగులకు కుదించుకు పోయింది..! దాదాపు 2018 నుండి ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేశారు.. చర్యలు తీసుకోమని కలెక్టర్ ఆదేశాలున్నా చర్యలు మాత్రం కాగితాలకే పరిమితం అయ్యాయని బాధితులు ఆరోపిస్తున్నారు.. నేటికి సమస్యకు పరిష్కారం దొరకపోగా.. మరోవైపు బాధితులు ఎనిమిదేళ్ళ సుదీర్ఘ నిరీక్షణకు అధికారుల నిర్లక్ష్యమే అడ్డుగోడగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..! అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ యంత్రాంగం మౌనం, చివరకు బాధితులు లోకాయుక్త తలుపు తట్టడంతో యంత్రాంగంలో కదలికలు వచ్చాయి.. లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ స్వయంగా రంగంలోకి దిగి సమస్యను పరిశీలించారు..!

## 2025లో మళ్లీ ప్రజావాణి ఫిర్యాదు..

ఇదే అంశంపై 01-09-2025న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు నమోదైనట్లు, బాధితుడి వద్ద ఉన్న ఆధారాలు వెల్లడిస్తున్నాయి. ఫిర్యాదు రిజిస్ట్రేషన్ నెంబర్: MCGMD/E/2025 /00053గా ఉంది.. అంటే 2024లో అక్రమ నిర్మాణాన్ని తొలగించినట్లు మున్సిపాలిటీ లోకాయుక్తకు నివేదిక ఇచ్చిన తర్వాత కూడా రహదారి ఆక్రమణలపై మళ్లీ ఫిర్యాదులు రావడం అసలు ఆక్రమణ పూర్తిగా తొలగించారా..? ఫొటోషూట్ చర్యలతో వెనుదిరిగారా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి..

## అక్రమ నిర్మాణం తొలగించామని గతంలో మున్సిపల్ నివేదిక..

లోకాయుక్తలో విచారణ సందర్భంగా దుండిగల్ మున్సిపాలిటీ తరపున హాజరైన స్టాండింగ్ కౌన్సిల్.. జె. రవీందర్, కుంటి అల్లయ్య నిర్మించిన గోడ/నిర్మాణం అక్రమమని గుర్తించి 19-11-2024న తొలగించినట్లు తెలిపింది. దీనికి సంబంధించి 20-11-2024 తేదీతో నివేదిక, ఫొటోలు లోకాయుక్తకు సమర్పించినట్లు ఉత్తర్వుల్లో నమోదైంది.. దీంతో ఇకపై విచారణ అవసరం లేదని పేర్కొంటూ అప్పటి లోకాయుక్త కేసును ముగించింది.. అయితే ఆ తర్వాత కూడా ఇదే రహదారి, ఆక్రమణలపై ఫిర్యాదులు కొనసాగుతుండటంపై ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.. లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ గాగిల్లాపూర్ సందర్శనతో.. దుండిగల్ మున్సిపల్, అధికారుల నిర్లక్ష్యానికి చెంపపెట్టుగా ఉందని అంటున్నారు..

## హైటెన్షన్ లైన్ కింద భారీ నిర్మాణంపై నిర్లక్ష్యం..

ఇదిలా ఉండగా, ఈ రహదారి పొడవునా హైటెన్షన్ విద్యుత్ లైన్ ఉండటం కూడా మరో ఆందోళనకర అంశంగా స్థానికులు చెబుతున్నారు.. రోడ్డు ఆక్రమణకు తోడు భారీ నిర్మాణం చేపట్టే సమయంలో హైటెన్షన్ వైర్ తగిలి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన అప్పట్లో తీవ్ర చర్చకు దారితీసిందని స్థానికులు గుర్తుచేస్తున్నారు.. హైటెన్షన్ లైన్ పరిధిలో నిర్మాణాలకు సంబంధించి భద్రతా నిబంధనలు, అనుమతులు, సంబంధిత శాఖల క్లియరెన్సులు ఉన్నాయా..? అనే అంశంపైనా అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు..

## లోకాయుక్తను ఆశ్రయించిన స్థానికులు..

గాగిల్లాపూర్ పాత పోస్టాఫీస్ రోడ్డును ఆనుకుని జరుగుతున్న ఆక్రమణలపై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు.. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో చివరకు లోకాయుక్తను ఆశ్రయించినట్లు బాధితులు చెబుతున్నారు.. 25 అడుగులుగా ఉన్న రహదారి ఆక్రమణల కారణంగా క్రమంగా 12 అడుగుల మేరకు కుదించుకుపోయిందని స్థానికుడు శివ నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ వ్యవహారంపై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.. మున్సిపల్ అధికారుల తీరుపై హైకోర్టును ఆశ్రయించామని, అనంతరం లోకాయుక్తను కూడా ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు..

## లోకాయుక్త రికార్డుల్లోనూ రోడ్డు ఆక్రమణ అంశం..

ఇదే వ్యవహారంపై గతంలో ఊటుకూరి జ్యోతి లోకాయుక్తను ఆశ్రయించారు. కంప్లైంట్ నెంబర్ 1192/2023/B1 కింద దాఖలైన ఫిర్యాదులో గాగిల్లాపూర్ 27వ వార్డు పరిధిలోని సర్వే నెంబర్లు 185, 186లో 25 అడుగుల రహదారిపై అక్రమ నిర్మాణాలు జరిగాయని పేర్కొన్నారు.. ఈ కేసులో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, దుండిగల్ మున్సిపాలిటీ చైర్మన్, కమిషనర్‌లను ప్రజాసేవకులుగా పేర్కొన్నారు.. బాధితులు ఈ రోడ్డు ఆక్రమణ అంశంపై దాదాపు ఎనిమిదేళ్ళుగా పోరాటం సాగిస్తున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ రోడ్డు కబ్జా వ్యవహారంలో, కేవలం దుండిగల్ మున్సిపల్ అధికారుల అండతోనే సాధ్యమైందని బాధితులు ఆరోపించారు..

## లేఅవుట్ మ్యాప్‌లో 25 అడుగుల రోడ్డు..

బాధితులు సమర్పించిన పాత లేఅవుట్/డిస్ట్రిబ్యూషన్ ప్లాన్లలో సర్వే నెంబర్ 185కు సంబంధించిన ప్లాట్ల మధ్య రహదారి, అలాగే 25 అడుగుల రోడ్డు ఉన్నట్లు పత్రాలు సూచిస్తున్నాయి. మరో మ్యాప్‌లో సర్వే నెంబర్ 185, 186 పరిధిలో ప్లాట్లు, రోడ్లు, పార్కు ప్రాంతం కూడా తెలుస్తుంది.. దీంతో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న రహదారి వెడల్పును అధికారిక లేఅవుట్, రెవెన్యూ రికార్డులు, మున్సిపల్ రికార్డులతో సరిపోల్చి పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.. ప్రస్తుతం టిజి-బిపాస్ చట్టం నిబంధనల ప్రకారం రోడ్డు 25 అడుగులు ఉన్నప్పటికీ, 30 ఫీట్లుగానే పర్మిషన్‌లు మంజూరులో చూపిస్తారు.. దీనికి తోడు 30 అడుగుల రోడ్డుకు ఇరువైపులా అదనంగా 5 ఫీట్లు వదిలేసి నిర్మాణం చేపట్టాలని తెలిసిన దుండిగల్ మున్సిపల్ అధికారులు ఆ విషయాన్నే మరిచి, అక్రమార్కులకు సహకరించడం ఆనవాయితీగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

## కలెక్టర్ ఆదేశాలున్నా.. చర్యలు శూన్యం..?

రోడ్డు ఆక్రమణలను తొలగించాలని గతంలోనే జిల్లా స్థాయి అధికారులు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, దుండిగల్ మున్సిపల్ అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు.. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా కొందరు కబ్జాదారుల నుంచి ముడుపులు స్వీకరించి అధికారులు చర్యలు తీసుకోకుండా, చివరికి లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ పరిశీలించాల్సిన పరిస్థితి నెలకొన్నదని బాధితులు ఆరోపిస్తున్నారు.. ఇప్పటికే దుండిగల్ సర్కిల్-59 సిఎంసి వ్యాప్తంగా అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతోంది.. ప్రస్తుతం రోడ్డు ఆక్రమణ ఆరోపణలు ఎదుర్కొంటున్న సమీపంలోనే, ఓనాయకునికి చెందిన పేకమేడ నిర్మాణం, అధికారుల కరప్షన్‌కి నిదర్శనంగా విమర్శలు ఉన్నాయి..




లేఅవుట్‌లో కొంత భాగం..

## దుండిగల్ సర్కిల్ అధికారుల తీరుపై ప్రశ్నలు..?

గాగిల్లాపూర్ 25 అడుగుల రహదారి వివాదం ఒక్క నిర్మాణానికి సంబంధించిన అంశంగా కాకుండా.. ప్రభుత్వ ప్రజా రహదారి హద్దుల పరిరక్షణ, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ పర్యవేక్షణ, నిర్మాణ అనుమతులు, హైటెన్షన్ విద్యుత్ లైన్ భద్రత, అధికారుల ఫిర్యాదుల పరిష్కారం వంటి పలు అంశాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. అక్రమ నిర్మాణం తొలగించామని 2024లో లోకాయుక్తకు నివేదిక ఇచ్చినప్పటికీ, 2025లో మళ్లీ ఫిర్యాదు ఎందుకు వచ్చింది..? గతంలో తొలగించిన నిర్మాణాలు తిరిగి ఎలా వచ్చాయి..? అధికారుల పర్యవేక్షణ లోపించిందా..? అన్న ప్రశ్నలకు సంబంధిత శాఖలు సమాధానం చెప్పాలి.. లోకాయుక్త తాజా క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం రహదారి ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు..? బాధ్యులపై ఏమైనా చర్యలు ఉంటాయా..? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.. ఈ పర్యటనలో దుండిగల్ ఎస్ఐ రంజిత్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్, ఇంచార్జ్ టీపీఎస్ సాయి తేజ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు కొత్త మున్సిపల్ చట్టం.. ఇక సేవలు మరింత సులభం

**ఆస్తిపన్ను పెంపుపై పరిమితి**
కొత్త విధానంలో ఆస్తిపన్ను లెక్కింపునకు రిజిస్ట్రేషన్ శాఖ గైడ్‌లైన్ విలువను ప్రాతిపదికగా తీసుకుంటారు. 375 చదరపు అడుగుల వరకు ఉన్న ఆస్తులకు రూ.101 నామమాత్రపు పన్ను కొనసాగుతుంది. కొత్త రేట్లు అమల్లోకి వచ్చే వరకు నివాస ఆస్తులకు 0.15 శాతం, నివాసేతర ఆస్తులకు 0.75 శాతం రేటు వర్తించనుంది.అయితే పన్ను ఒక్కసారిగా భారీగా పెరగకుండా పరిమితి విధించారు. గత ఏడాది పన్నుతో పోలిస్తే ఏ సంవత్సరంలోనూ పెరుగుదల 10 శాతానికి మించకుండా నిబంధనలు రూపొందించారు.

**భవన అనుమతులు ఆన్‌లైన్‌లోనే**
భవన అనుమతుల ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు పూర్తిగా ఆన్‌లైన్ విధానం అమలు చేయనున్నారు. నిర్ణీత సమయంలో అధికారులు స్పందించకపోతే దరఖాస్తు పైస్థాయికి వెళ్లేలా వ్యవస్థ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో డీమ్డ్ అప్రూవల్‌కు కూడా అవకాశం కల్పించారు.చిన్నపాటి నిబంధనల ఉల్లంఘనలకు క్రిమినల్ కేసులకు బదులుగా సివిల్ జరిమానాలు విధించే విధానాన్ని తీసుకొచ్చారు. అయితే ముందుగా షోకాజ్ నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది.

**రోడ్డు తవ్వకాలపై సమన్వయం**
ఒక శాఖ వేసిన రోడ్డును మరో శాఖ తిరిగి తవ్వే పరిస్థితులకు అడ్డుకట్ట వేసేందుకు యుటిలిటీ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్, రోడ్డు భద్రతకు ప్రత్యేక అథారిటీ పనిచేస్తుంది. ఫుట్‌పాత్‌లు, పాదచారుల క్రాసింగ్‌లు, వీధి దీపాలు, ట్రాఫిక్ సిగ్నల్లపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు.

**చెరువులు, నాలాలకు రక్షణ**
చెరువులు, నాలాలు, పార్కులు, బహిరంగ ప్రదేశాల పరిరక్షణకు కొత్త చట్టంలో ప్రాధాన్యం ఇచ్చారు. జలవనరుల్లో మురుగునీరు, కాలుష్య వ్యర్థాలు వదలకుండా చర్యలు తీసుకోనున్నారు. ఆక్రమణలు, అక్రమ వ్యర్థాలపై చర్యలకు హైడ్రాకు మరింత చట్టబద్ధమైన బలం లభించనుంది.నాలాలు, చెరువులు, ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలు వేస్తే అధిక జరిమానాలు విధించనున్నారు. పెద్ద భవనాల్లో వర్షపు నీటి సంరక్షణను తప్పనిసరి చేసే అవకాశం కూడా ఉంది.

**విపత్తులపై ప్రత్యేక ప్రణాళిక**
కోర్ అర్బన్ రీజియన్ మొత్తానికి సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించనున్నారు. వరదలు, అగ్నిప్రమాదాలు తదితర విపత్తుల సమయంలో ముందస్తు చర్యలు, స్పందన, పునరుద్ధరణకు ప్రత్యేక వ్యవస్థ పనిచేస్తుంది. ప్రమాదకర భవనాలపై తనిఖీలు నిర్వహించి, అవసరమైతే వాటిని తాత్కాలికంగా సీజ్ చేసే అవకాశం ఉంటుంది.మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారులు, ట్రాన్స్‌జెండర్లు, గిగ్ కార్మికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగర మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని చట్టం పేర్కొంది. మరోవైపు పాతకాలం నాటి అనేక కాలం చెల్లిన నిబంధనలను తొలగించారు.

# గుండు వెంకట్ ప్రతిభకు పట్టం 'భారత్ కళా పురస్కార్-2026'తో సత్కారం




ఖమ్మం, పెన్ పవర్,అక్టోబర్ 4: ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ గుండు వెంకట్ (సినిమాటిక్)కు ప్రతిష్టాత్మక 'భారత్ కళా పురస్కార్--2026' లభించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక అవార్డు కార్యక్రమంలో బెస్ట్ వెడ్డింగ్ ఫోటోగ్రాఫర్ విభాగంలో నిర్వాహకులు గుండు వెంకట్‌ను ఘనంగా సత్కరించి పురస్కారాన్ని అందజేశారు.వివాహ వేడుకల్లోని అపురూపమైన క్షణాలను తనదైన శైలిలో కెమెరాలో బంధిస్తూ గుండు వెంకట్ ఫోటోగ్రఫీ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ముఖ్యంగా వెడ్డింగ్ ఫోటోగ్రఫీలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ వినూత్నమైన ఫోటోలు, వీడియోలను రూపొందిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. వధూవరుల జీవితంలో మరపురాని జ్ఞాపకాలుగా నిలిచే ప్రతి సందర్భాన్ని కళాత్మకంగా చిత్రీకరించడంలో ఆయన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.ఫోటోగ్రఫీ రంగంలో గుండు వెంకట్ అందిస్తున్న సేవలు, ప్రతిభ.వెడ్డింగ్ ఫోటోగ్రఫీలో ఆయన అనుసరిస్తున్న నూతన పద్ధతులను గుర్తించిన నిర్వాహకులు భారత్ కళా పురస్కార్--2026'కు ఆయనను ఎంపిక చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన అవార్డు కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకోవడం పట్ల గుండు వెంకట్ ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గుండు వెంకట్ మాట్లాడుతూ.. తన ప్రతిభను గుర్తించి ప్రతిష్టాత్మక పురస్కారంతో సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ఫోటోగ్రఫీ రంగంలో మరింత సృజనాత్మకంగా పనిచేస్తూ, వినూత్నమైన సేవలను అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన ఎదుగుదలకు సహకరిస్తున్న కుటుంబ సభ్యులు, మిత్రులు, కస్టమర్లు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.గుండు వెంకట్‌కు 'భారత్ కళా పురస్కార్--2026' లభించడంపై గోళ్లపాడు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, ఫోటోగ్రఫీ రంగానికి చెందిన మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్

కుటుంబ సమేతంగా దర్శించుకున్న శ్రీ వి.పి. గౌతమ్ ఐఏఎస్



హైదరాబాద్ పెన్ పవర్: వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని ఈరోజు సాయంకాలం తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ శ్రీ వి.పి గౌతమ్, ×ూా ా., కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీ గౌతమ్ వారికి అర్చకులు అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రములు బహుకరించి ప్రసాదములు అందజేశారు.

# ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు

ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే మనందరి బాధ్యత




హైదరాబాద్ పెన్ పవర్:
ట్రస్మా మరియు వడుప్స ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి
వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని నాని గార్డెన్లో నిర్వహించిన ట్రస్మా మరియు వడుప్స ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరైనారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం అభినందనీయమైన కార్యక్రమం అని అన్నారు.
అవార్డు అందుకున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు, మంచి భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు అని అన్నారు.సమాజంలో వివిధ విభాగాల ఉన్నతాధికారుల కన్నా గ్రామంలో ఉన్న ఉపాధ్యాయునికి ఒక గుర్తింపు గౌరవం ఉందన్నారు.విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తుంది అని,ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే మనందరి బాధ్యత అని అన్నారు.ప్రభుత్వ స్థలంలో కమిటీ హాల్ ఏర్పాటుకు సహకరిస్తానని అన్నారు.తల్లిదండ్రుల తర్వాత అత్యధికంగా గౌరవించేది ఉపాధ్యాయులను అన్నారు.

# బయ్యారం కాంగ్రెస్‌లో వర్గపోరు--- అసంతృప్తిగా ఉన్న కార్యకర్తలు బీఆర్ఎస్ వైపు..?

హైదరాబాద్ పెన్ పవర్:
మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి రోజురోజుకూ తయారవుతున్న తీరు స్థానిక నాయకత్వానికి,క్యాడర్‌కు మింగుడుపడటం లేదు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, మండలంలో మాత్రం పార్టీ గ్రాఫ్ వేగంగా పడిపోతోందనే చర్చ జోరుగా సాగుతోంది.

**గ్రూపు రాజకీయాల జోరు..!**
మండలంలో పార్టీ బలోపేతం కావడం పక్కన పెడితే,నేతల మధ్య ఆధిపత్య పోరు పరాకాష్టకు చేరింది.కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా రెండు వర్గాలుగా విడిపోయి, ఒకరికొకరు పోటీగా సొంత అజెండాతో ముందుకు సాగుతున్నారు.ప్రభుత్వ,పార్టీ కార్యక్రమాలను సైతం రెండు వర్గాలు విడివిడిగా నిర్వహిస్తుండటం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది.
ఒక వర్గం వేసే అడుగులకు మరొక వర్గం చెక్ పెట్టేలా వ్యవహరిస్తుండటంతో,స్థానిక ప్రజలకు, శ్రేణులకు ఎవరి వెంట నడవాలో అర్థం కాక గందరగోళానికి గురవుతున్నారు.

**అధికారంలో ఉన్నా నిరాశలోనే కార్యకర్తలు..!**
కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చుకున్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు తీవ్ర తీవ్ర నిరాశలో కూరుకుపోయారు.పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ తమకు ఎలాంటి గుర్తింపు,పనులు కావడం లేదని,అంతా వర్గపోరుకే సరిపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండల స్థాయి నాయకుల వైఖరితో విసిగిపోయిన క్యాడర్,పార్టీ భవిష్యత్తుపై నమ్మకం కోల్పోతోంది.

**బిఆర్ఎస్ వైపు చూపుతున్న కార్యకర్తలు..!**
నేతల మధ్య నిరంతరం సాగుతున్న ఆధిపత్య పోరు,గ్రూపు రాజకీయాల వల్ల విసిగిపోయిన పలువురు ముఖ్య కార్యకర్తలు నాయకులు ఇప్పుడు గులాబీ జెండా వైపు చూస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.
స్థానికంగా కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న బిఆర్ఎస్ నాయకులు,అసంతృప్తిగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలను తమ వైపు తిప్పుకునేందుకు చక్రం తిప్పుతున్నారు.పార్టీ నాయకత్వం ఇప్పటికైనా స్పందించి ఈ వర్గపోరుకు అడ్డుకట్ట వేయకపోతే,బయ్యారం మండలంలో కాంగ్రెస్ ఖాళీ అయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఎమ్మెల్యే కోరం కనకయ్య,జిల్లా ముఖ్య నాయకులు తక్షణమే జోక్యం చేసుకుని బయ్యారం కాంగ్రెస్‌లో సయోధ్య కుదర్చకపోతే,రాబోయే రోజుల్లో పార్టీ మరింత గడ్డు పరిస్థితిని ఎదుర్కోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పట్లోళ్ల విష్ణువర్ధన్ రెడ్డి





హైదరాబాద్ పెన్ పవర్:
ఆదివారం నాడు మంత్రి దామోదర రాజనరసింహ సంగారెడ్డి నివాసంలో ఆయన చేతుల మీదుగా నియామక పత్రం అందజేసారు. టి పి సి సి (టి పి సి సి) ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బర్దిపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ పట్లోల విష్ణువర్ధన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర మంత్రి దామోదర రాజనరసింహ గారిని మర్యాదపూర్వకంగా కలిసి, వారి చేతుల మీదుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష నియామక పత్రాన్ని అందుకున్నారు. గతంలో మండల వైస్ ఎంపీపీగా పనిచేసిన అనుభవంతో, రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి విష్ణువర్ధన్ రెడ్డి మరింత కృషి చేస్తారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం మరియు మంత్రి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి శ్రమిస్తానని ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ అధ్యక్షులు ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు ఆయనకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# ఆరుట్ల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి మరువలేనిది..

✱ అధిక నిధులతో శరవేగంగా అభివృద్ధి పనులు: మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య..



హైదరాబాద్ పెన్ పవర్:
ఆరుట్ల గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేస్తున్న కృషి మరువలేనిదని మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య అన్నారు. గ్రామానికి అధిక నిధులు కేటాయిస్తున్న ఎమ్మెల్యేకు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆరుట్ల గ్రామంలోని లెనిన్‌నగర్ కాలనీ తూర్పు బస్తీలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన రూ.20 లక్షల నిధులతో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా అనంగల్ల యాదయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎమ్మెల్యే సహకారంతో గతంలో ఎన్నడూ జరగని స్థాయిలో రెండున్నరేళ్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామంలోని ప్రతి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అవుతున్నాయని పేర్కొన్నారు. ఆరుట్ల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి ఆరుట్లను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని యాదయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎండీ ఇమ్రాన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కంబాలపల్లి బుగ్గరాములు, చెరుకు నర్సింహ, బుట్టి కృష్ణ, మార లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, అంతటి రాజుగౌడ్, దాసరమోని రమేష్, ఉదరి నర్సింహ, రావుల నాగరాజు, దాసరమోని అశోక్, మంకు శ్రీను, భాస్కర్, రైనా, ఎండీ అశ్రఫ్, దండ వెంకన్న, సోషల్ మీడియా కన్వీనర్ దూసరి రాజు, నూకం శేఖర్, చిందం భాష, లక్ష్మా నాయక్, సుంకరి దానయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదలు, సెటిలర్లను ఇబ్బందిపెడితే సహించను: మల్‌రెడ్డి రంగారెడ్డి..

తొర్రూర్ డివిజన్‌లో రూ.1.38 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం..





హైదరాబాద్ పెన్ పవర్: పేదలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన సెటిలర్లను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే సహించబోనని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివారం తొర్రూర్ డివిజన్ పరిధిలో రూ.1.38 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. శ్రీరంగంపురం కాలనీలో రూ.10 లక్షలు, బాలాజీనగర్‌లో రూ.20 లక్షలు, తిరుమలనగర్‌లో రూ.10 లక్షలు, యాపిల్ కాలనీలో రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. తుర్కయంజాల్‌లో రూ.30 లక్షలతో నిర్మించిన స్మశానవాటిక, రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాల్, యాపిల్ ఎవెన్యూ కాలనీలో రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న పదేళ్లలో తుర్కయంజాల్, హయత్‌నగర్ ప్రాంతాలు ఆదర్శంగా ఉండేవని, అనంతరం అస్తవ్యస్తంగా మారాయని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. తొర్రూర్ సమీపంలో మరో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు డివిజన్ అధ్యక్షులు కోశిక ఐలయ్య, తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షులు ఓర్సు శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, మాజీ కౌన్సిలర్ కాకుమాను సునీల్, సీనియర్ నాయకులు సామ భీమ్ రెడ్డి, వంగేటి గోపాల్ రెడ్డి, బొక్క వంశీధర్ రెడ్డి, ఆదిభట్ల సర్కిల్ డిసి సత్యనారాయణ రెడ్డి, అధికారులు నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీ అధ్యక్షులు, ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 31వ వార్డులో సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ

**లబ్ధిదారులకు సీఎం సహాయనిధి, కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్ ద్వారా ఆర్థిక చేయూత**



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారి క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేస్తున్న దృశ్యం

**ంఖమ్మం, పెన్ పవర్,అక్టోబర్ 4:** ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డుకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి( సి ఎం ఆర్ ఎఫ్) కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. సీఎం సహాయనిధి ద్వారా వైద్య, ఇతర అత్యవసర అవసరాలకు ఆర్థిక సహాయం అందుతుందని, కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు వివాహ సమయంలో ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు.కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్, కౌన్సిలర్ కడవ నవీన్, వెంపటి సురేష్, ఏపూరి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చుతున్న రెడీ టూ సర్వ్ ఫౌండేషన్, నవదీప ఫౌండేషన్ సంస్థలు

**బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం**

**నిర్వాహకులను అభినందించిన ప్రజలు**



**ఎల్బీనగర్, పెన్ పవర్, అక్టోబర్ 4:**హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఉన్న బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రెడీ టూ సర్వ్ ఫౌండేషన్, నవదీప ఫౌండేషన్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి వద్ద చికిత్స కోసం వచ్చిన పేద రోగులకు, వారి కుటుంబ సభ్యులకు, అవసరమైన సుమారు 300 మందికి ఉచితంగా భోజనం పంపిణీ చేశారు. సేవా కార్యక్రమంలో పలువురు స్వచ్ఛందంగా వాలంటీర్లుగా పాల్గొని, స్వయంగా ఆహారం పంపిణీ చేశారు. సమాజంలో ఆకలితో బాధపడుతున్న వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పేద ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించనున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రుల వద్ద చికిత్స కోసం నిరీక్షించే పేద రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈ అన్నదానం ఎంతో ఉపయోగకరంగా మారిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. 'రెడీ టూ సర్వ్' ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ గౌడ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే దాతలు, స్వచ్ఛంద సేవకులు తమను సంప్రదించాలని కోరారు. సమాజ సేవలో మరి కొంత మంది భాగస్వాములు కావడం వల్ల అవసరమైన వారికి మరింత విస్తృతంగా సహాయం అందించగలమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

## తిర్లాపురంలో మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో ప్రజలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**గార్ల, పెన్ పవర్, అక్టోబర్: 4** గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో గార్ల మండలంలోని మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని తిర్లాపురం గ్రామంలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యుడు జర్పుల పృథ్వీరాజ్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గార్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణగౌడ్, మర్రిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య రాంసింగ్ నాయక్ లు ప్రారంభించారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వైద్యులు డాక్టర్ బి. ప్రవీణ్ నాయక్ శిబిరానికి హాజరై గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన రోగులను పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితిపై తగిన వైద్య సూచనలు అందించారు. అనంతరం అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో జర్పుల వీరన్న, అనుముల గంగ, తేజావత్ గణేష్, మూడు రాము, మాలోత్ వేణు, మూడు హరి ఎక్స్ ఎస్ఐ, తేజావత్ మోహన్, జర్పుల లాల్య, తేజావత్ జగన్, మండల రవిగౌడ్, టీచర్ బాజీతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# గుడ్ న్యూస్... వాతావరణ శాఖ కీలక అప్ డేట్.. భారీ వానలేనట




ఆంధ్రప్రదేశ్ , తెలంగాణలలో నేడు వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మరోసారి వాతావరణ హెచ్చరిక జారీ చేసింది. అక్టోబర్ 13 నాటికి అల్పపీడనం.. వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని చెప్పింది. 13వ తేదీ నాటికి అల్పపీడనం ఏర్పడుతుంది. అక్కడి నుంచి అది మెల్లగా పశ్చిమ, వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడుతుంది. ఇక అక్టోబర్ 15 నాటికి దక్షిణ, మధ్య బంగాళాఖాతంలో ఇదో పెద్ద వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వాయుగుండం బలపడి ఏపీ వైపునకు దూసుకు వస్తే మరోసారి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. అదే సమయంలో కొంత వాతావరణంలో మార్పులు సంభవించి ఉష్ణోగ్రతలు తగ్గుతాయని, వేడి గాలుల ఉధృతి తగ్గుతందని చెబుతున్నారు. అయితే రానున్న రెండు మూడు రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది.

**ఏపీలోనేడు వెదర్...**

ఆంధ్రప్రదేశ్ వాతావరణంపై నేడు అమరావతి వాతావరణ శాఖ కీలక అప్ డేట్ ఇచ్చింది. కోస్తాంధ్ర, యానాంతో పాటు ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి వానలు కురిసే సూచన ఉంది. బలమైన గాలులు వీస్తాయని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.బంగాళాఖాతంలో మరో ఓ అల్పపీడనం ఏర్పడబోతోందని, అది క్రమంగా వాయుగుండంగా మారే ఛాన్స్ ఉందని వెల్లడించింది. దీంతో భారీగా వర్షాలు పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం అధికారులు అల్పపీడనానికి సంబంధించిన కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు.వాస్తవానికి ఈ సంవత్సరం నైరుతి రుతు పవనాల సీజన్‌లో అంటే జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకు ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదయ్యింది. ఈ సీజన్‌లో సాధారణంగా రాష్ట్రవ్యాప్తంగా సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షం కురవాలి. కానీ, రికార్డ్ కేవలం 383.6 మిల్లీమీటర్లు వర్షపాతం మాత్రమే కురిసింది. అంటే ఏకంగా 34.9 శాతం లోటు వర్షపాతం కనిపిస్తుంది.

**తెలంగాణలో నేడు వానలు...**

తెలంగాణ లో నేడు వానలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రాబోయే మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.ఉరుములు, మెరుపులు: కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. వర్షం లేక , ప్రాజెక్టుల్లో నీళ్లు లేక, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. వానలు లేక, నీళ్లు లేక అక్కడి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చింది. ఎల్‌నినో దెబ్బకు పచ్చటి పొలాలు ఎండిపోతున్న సమయంలో మరో వాయుగుండం వస్తే దాని ప్రభావంతో వానలు పడి కొంతలో కొంత ప్రయోజనం చేకూరుస్తుందని చెబుతున్నారు. ఇప్పటికే తెలంగాణలో కరువు మండలాలను ప్రకటించిన ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సాయం కోరుతూ నివేదికను పంపాలని నిర్ణయించింది. ఈ పరిస్థితుల్లో బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం ప్రభావంతోనైనా కొంత ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడమే కాకుండా, సాగుకు ప్రయోజనం చేకూరుస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

# ఘనంగా మహవీర్ భగవాన్ శోభాయాత్ర





మహవీర భగవాన్ ఊరేగింపులో పాటలు ఆలపిస్తున్న జైనులు

**గార్ల, పెన్ పవర్, అక్టోబర్ :4**

దస్ లక్షణ్ పర్వ్ ముగింపు రోజైన ఆదివారం జైనుల ఆరాధ్యదైవం మహవీర్ భగవాన్ ఊరేగింపును గార్ల పురవీధుల్లో జైనులు ఘనంగా నిర్వ హించారు. 10 రోజుల పాటు జైనులు ఉపవాసాలు ఉండి గార్లలోని జైన్ మందిరంలో మహవీర్ భగవాన్ కు అభిషేకాలు, శాంతిపూజలు నిర్వహించారు. దస్ లక్షణ్ పర్వ్ చివరి రోజున మహవీర్ భగవాన్ ను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ప్రతిష్టించి పురవీధుల్లో జైనులు ఏకరూప కాశాయ దుస్తులు ధరించి మేళతాళాల నడుమ ఊరేగింపులో పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ జైనుల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో జైనులు మహవీర్ భగవాన్ బోధనలైన జియో ఔర్ జీనేదో అహింసా పరమోధర్మ, శాఖాహార్ అప్నాఓ సుఖ్ జీవన్ బితావో అనే నినాదాలు చేస్తూ గీతాలు ఆలపించారు. ఈకార్యక్రమంలో గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ భానోత్ పార్వతి హతిరాం నాయక్ జైనులు , వినోద్ జైన్, ప్రవీణ్ జైన్, నతీన్ జైన్, మహవీర్ జైన్, విమల్ కుమార్ జైన్, సంకేత్ జైన్, సంజీల్ జైన్, అజయ్ జైన్, విజయ్ జైన్, రమేష్ జైన్, విశాలైన్. విపులైన్, ఆకాష్ జైన్, గోపాల్ జైన్, , విక్కిజైన్, మనోజ్ జైన్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల విషయంలో చేతివాటం?

**బాధితుల నుంచి రూ.10వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేశారంటూ ఆరోపణలు**

**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 4:** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామంలో సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇప్పిస్తానని చెప్పి గ్రామానికి చెందిన తోటపల్లి వెంకటేశ్వర్లు కొంతమంది బాధితుల నుంచి నగదు తీసుకున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధితుల కథనం ప్రకారం ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.10 వేలు, రూ.15 వేలు, రూ.25 వేల చొప్పున నగదు తీసుకున్నారని, ఇప్పటి వరకు సుమారు ఎనిమిది మంది నుంచి డబ్బులు తీసుకున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు తీసుకున్నప్పటికీ, చెక్కుల మంజూరు విషయంలో స్పష్టత లేకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, గ్రామంలో మరికొంతమంది వద్ద కూడా ఇదే విధంగా నగదు తీసుకున్నట్లు సమాచారం ఉందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తి వివరణ, అధికారిక ధృవీకరణ వెలువడాల్సి ఉంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి, నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని బాధితులు కోరుతున్నారు. సీఎంఆర్ఎఫ్ వంటి ప్రభుత్వ సహాయ పథకాల విషయంలో నగదు వసూళ్లకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



మోసపోయిన బాధితులు

# ముత్తగూడెంలో మెరిసిన ఆణిముత్యం

**ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ పట్టా సాధించిన గూదే నరసింహారా**

**ఖమ్మం పెన్ పవర్ అక్టోబర్ 4:**

ఏదిలాపురం మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు ముత్తగూడెంకు చెందిన గూదే నరసింహారావు కాకతీయ యూనివర్సిటీ నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ (డాక్టరేట్) పట్టా సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు.ముత్తగూడెంకు చెందిన గూదే పర్వతాలు కుమారుడైన నరసింహారావు ప్రస్తుతం మధిరలోని టి.వి.ఎం. ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మరోవైపు ఉన్నత విద్యను అభ్యసించాలనే పట్టుదలతో పరిశోధన కొనసాగించారు. కాకతీయ యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ పి. రవికుమార్ ప్రత్యేక పర్యవేక్షణలో పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం పీహెచ్‌డీ (డాక్టరేట్) పట్టా పొందారు.ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ సాధించడం ద్వారా నరసింహారావు పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఆయనను కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.



# కూటమి పద్మవ్యూహం....వైసీపీ తట్టుకోగలదా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను త్వరలో నిర్వహించనుంది. అయితే 2021లో వైసీపీ ప్రభుత్వం హయాంలో కూడా స్థానిక ఎన్నికలు జరిగాయి. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటి అంటే ఆనాడు పరోక్ష ఎన్నికలు జరిగాయి. మేయర్ జెడ్పీ చైర్మన్లను సభ్యులు ఎన్నుకునే వారు. దాంతో పెద్ద ఎత్తున సభ్యుల బలం కోసం ఏకగ్రీవాలను వైసీపీ ప్రోత్సహించింది అన్న విమర్శలు వచ్చాయి. అంతే కాదు ప్రతిపక్ష పార్టీలు నామినేషన్లు కూడా వేయకుండా అధికార బలంతో అడ్డుకుందని కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో జెడ్పీ ఎన్నికల నుంచి టీడీపీ మధ్యలోనే తప్పుకుని తన నిరసనను వ్యక్తం చేసింది. మొత్తానికి నూటికి తొంబై శాతం దాకా వైసీపీ గెలిచి లోకల్ బాడీస్ లో పాగా వేసింది. అయినా ఏమి లాభం, 2024 లో ఈ స్థానిక ఎన్నికల ఫలితాలు పెద్దగా ఉపయోగపడలేదు, వైసీపీ చిత్తుగా ఓటమి పాలు అయింది.

**కట్ చేస్తే కూటమి సర్కార్ :**

ఇక ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్థానిక ఎన్నికలను నిర్వహిస్తోంది. ఈ ఎన్నికల్లో నిజానికి వైసీపీ మొదట పాల్గొనరాదనే చర్చ సాగింది అని అంటున్నారు. ఎపుడైతే మేయర్ జెడ్పీ చైర్మన్లు మునిసిపలి చైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికల విధానం అమలులోకి తీసుకుని వచ్చారో దాంతో వైసీపీలో కొత్త ఆశలు చిగురించాయి. ప్రత్యక్ష ఎన్నికలు కాబట్టి కీలక పదవుల విషయంలో పార్టీ జెండా జగన్ ఇమేజ్ ఉపయోగపడతాయని భావిస్తూ ఆ పార్టీ పోటీ చేయాలని నిర్ణయించుకుంది. ఇక జగన్ అయితే వెరీ సీరియస్ అన్నట్లుగా లోకల్ బాడీ ఎన్నికలను తీసుకున్నారు. పదే పదే పార్టీ సమావేశాలలో ఆయన ఎన్నికలు చాలా కీలకం అని ప్రస్తావిస్తున్నారు. పార్టీ శ్రేణులను ఆయన ఎన్నికల సమరం వైపుగా నడిపించే ప్రయత్నం చేస్తూ ఉత్సాహం నింపుతున్నారు.

**అదే సందేహంగా :**

అంతవరకూ బాగానే ఉంది కానీ కూటమి ప్రభుత్వం కూడా ఆనాడు వైసీపీ చేసినట్లుగా అధికార బలం చూపిస్తే ఏమవుతుంది అన్నదే ఫ్యాన్ పార్టీలో సందేహంగా ఉంది. నామినేషన్ల నుంచే నాడు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు ప్రతిపక్షాలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి ఉంటుందా అని చర్చిస్తున్నారు. అభ్యర్థులను నిలబెట్టడం వరకూ అయితే వైసీపీ అధినాయకత్వం వారికి ఉత్సాహం ఇస్తోంది. అయితే వారు రంగంలో చివరి దాకా ఉండాలి. అధికార కూటమి ఒత్తిళ్లను తట్టుకోవాల్సి ఉంటుంది. అంతే కాదు పోలీసులను ప్రయోగిస్తే ధీటుగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక అభ్యర్థులుగా ఉన్న వారి చరిత్రను మొత్తం తిరగతోడే చాన్స్ ఉంది. ఇలా అన్ని వైపుల నుంచి వచ్చే కష్టాలను నష్టాలను భరిస్తూ వైసీపీ శ్రేణులు ఎంతవరకూ ముందుకు వెళ్తాయి అన్నది పార్టీ పెద్దలలో కూడా ఉంది అని అంటున్నారు.

**నిలిచి పోరాడితేనే :**

అన్ని ఇబ్బందులు అధిగమించి నిలిచి పోరాడితేనే వైసీపీ గెలిచినట్లు అని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకూ చూస్తే ప్రజాభిప్రాయంలో పెద్దగా తేడా ఏమీ ఉండదని అంటున్నారు. ఇంకా కూటమి చేతిలో సగం పాలన ఉండగా జనాలు ప్రతిపక్షాన్ని గెలిపించి అభివృద్ధిని తమ ప్రాంతంలో దూరం చేసుకోరని కూడా అంటున్నారు. అందువల్ల వైసీపీ పెద్ద ఎత్తున గెలిచేస్తుంది అన్నది ఆ పార్టీలో ఉత్సాహం కోసం అన్నట్లుగానే చూడాలని అంటున్నారు అదే సమయంలో వైసీపీ తుది వరకూ పోరాడి తన ఓటు బ్యాంక్ ని కాపాడుకుంటూ నిలిస్తే మాత్రం అదే అసలైన గెలుపుగా చూడాలని అంటున్నారు. అధినాయకత్వం కూడా అందుకోసమే పోటీకి దింపుతోందని చెబుతున్నారు. మరి వైసీపీ తట్టుకుంటుందా అన్నదే అతి పెద్ద ప్రశ్నగా ఉంది.

# అందుకే కళ్ళు మూసుకున్నాం... చిన్న శ్రీనుపై బొత్స !



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయనగరం జిల్లాలో స్థానిక ఎన్నికల రాజకీయం కంటే కూడా వైసీపీలో చిన్న శ్రీను ప్రకంపనలు తదనంతర పరిణామాలే ఎక్కువ హీట్ ని పుట్టిస్తున్నాయి. చిన్న శ్రీను పార్టీని వీడి నెల రోజులు అవుతున్నా ఆ ప్రభావం వైసీపీని స్థిమితం లేకుండా చేస్తోంది. తాజాగా చిన్న శ్రీను వియ్యంకుడు బద్దుకొండ అప్పలనాయుడు సస్పెండ్ అయ్యారు. దాంతో ఆగ్రహించిన ఆయన వైసీపీకి గుడ్ బై చెప్పారు. మరిన్ని వికెట్లు పడబోతున్నాయని చిన్న శ్రీను వర్గం ఒక వైపు సంకేతాలు ఇస్తోంది. విజయనగరం జిల్లా వైసీపీ అంటేనే మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నంతగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ మొత్తం పరిణామాల మీద బొత్స తనదైన శైలిలో స్పందించారు. ఎస్ కోట నియోజకవర్గంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో బొత్స మాట్లాడుతూ పార్టీని వీడిన వారిది దోపిడీయే అజెండా అని హాట్ కామెంట్స్ చేశారు.

**పోతే ఏటవుతాది :**

బొత్స ఉత్తరాంధ్ర భాషలో మాట్లాడుతూ పార్టీ అన్నాక ఇలాంటివి సహజం అన్నారు. ఒకరిద్దరు నాయకులు బయటకు వెళ్ళినంత మాత్రాన ఏమవుతుందని ప్రశ్నించారు. పార్టీ ఎప్పటికీ శాశ్వతం అన్నారు. వైసీపీకి జనంలో ఆదరణ ఉందని ప్రజలు పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. అందువల్ల నాయకులు వెళ్తే పార్టీకి ఏమీ కాదని చెప్పారు. స్వార్థంతో స్వలాభంతోనే కొందరు పార్టీని వీడిపోతున్నారు అని ఆయన మండిపడ్డారు. నాయకులు వెళ్ళినంత మాత్రాన కార్యకర్తలకు ఎలాంటి నష్టం లేదని అన్నారు. వారికి పార్టీ అండగా ఉంటుందని బొత్స చెప్పారు.

**ప్రేమ ఎక్కువైపోయి :**

చిన్న శ్రీను పార్టీని వీడడం మీద బొత్స వ్యాఖ్యానిస్తూ అభిమానం ప్రేమ ఉన్న చోట కళ్ళు మూసుకుని పోతాయని వ్యాఖ్యానించారు. అందువల్లనే ఇన్నాళ్ళూ కొన్ని విషయాలని పట్టించుకోలేదని అన్నారు. అది తమ అవివేకం కూడా కావచ్చు లేదా అశ్రద్ధ కూడా కావచ్చు అని బొత్స తన మీదనే సెటైర్లు వేసుకున్నారు. ఆనాడు దృష్టి పెట్టకపోవడం వల్లనే ఇలాంటివి జరిగాయని, ఇలా ఫిరాయిస్తున్న వారి అసలు ఉద్దేశ్యాలు కూడా ఆలస్యంగానే అర్థం అయ్యాయని ఆయన చెప్పుకొచ్చారు. ఈసారి చాలా జాగ్రత్తగా ఉంటామని కార్యకర్తలకే పెద్ద పీట వేస్తామని ఆయన చెప్పారు.

**కష్టపడిన వారికే :**

ఎవరైతే పార్టీ కోసం పనిచేస్తారో కష్టపడతారో వారికే ప్రాధాన్యత ఉంటుందని బొత్స అన్నారు. తాను క్యాడర్ కి అండగా ఉంటాను అని ఆయన హామీ ఇచ్చారు. ఏపీలో కూటమి పాలన తీరు మీద కూడా ఆయన నిప్పులు చెరిగారు. తన మొత్తం రాజకీయ జీవితంలో ఈ తరహా దోపిడీ పాలన చూడలేదని బొత్స మండిపడ్డారు. ప్రజలతో కలిసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాల మీద వైసీపీ ఉద్యమిస్తుందని బొత్స స్పష్టం చేశారు.

**బొత్స చెప్పిందేంటి :**

ఇవన్నీ పక్కన పెడితే బొత్స చెప్పిందేంటి అన్నది వైసీపీలో చర్చ సాగుతోంది. సొంత మేనల్లుడు కాబట్టే చూసీ చూడనట్లుగా వ్యవహరించామని ఇపుడు ఆయన పశ్చాతాపం పడుతున్నారా అన్నది కూడా ఆలోచిస్తున్నారు. బొత్సకు చిన్న శ్రీను పార్టీని వీడడం వంటి పరిణామం అయితే ఇబ్బందికరంగా మారిందనే అంటున్నారు. పోయే వారు పోతారు అని తేలికగా అంటున్నా జిల్లా రాజకీయాల్లో వైసీపీకి అలాగే బొత్స ఆధిపత్యానికి ఒక సవాల్ గానే ఈ పరిణామాలు ఉండబోతున్నాయని కూడా విశ్లేషిస్తున్నారు.

# ఐరోపా అంటుకుంది.. ఆ రెండు దేశాలు అట్టుడుకుతున్నాయి..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐరోపా ఖండంలోని రెండు ఆర్థిక వ్యవస్థలైన ఫ్రాన్స్, స్పెయిన్‌లు ప్రస్తుతం తీవ్ర సామాజిక, రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయాయి. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ వేలాది మంది ప్రజలు, యువత రోడ్లపైకి వచ్చి చేస్తున్న ఆందోళనలు ఆయా దేశాలలో కలకలం సృష్టిస్తున్నాయి. వేర్వేరు అంశ ప్రాతిపదికన ఈ నిరసనలు ఉద్భవించినప్పటికీ.. ప్రభుత్వాల విధానాల పట్ల పౌరుల్లో పెరుగుతున్న అసంతృప్తి, నిరాశలు ఈ పోరాటాలకు ప్రధాన ఇంధనంగా మారాయి. రోజువారీ జీవితాన్ని శాసిస్తున్న ప్రాథమిక వసతుల కరవుపై పౌరులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్రాన్స్‌లో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. దేశ విద్యావ్యవస్థలో పేరుకుపోయిన లోపాలు, నిర్లక్ష్య వైఖరిపై విద్యార్థి లోకం మండిపడుతోంది. పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడానికి అవసరమైన ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండటంతో పాటు.. తరగతి గదుల కొరత విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. కనీస మౌలిక సదుపాయాలు లేని వాతావరణంలో విద్యను కొనసాగించాల్సి రావడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిరసనకారులు వీధుల్లో నిర్వహించిన ర్యాలీలు, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో పలు నగరాలు అట్టుడికాయి. కొద్ది ప్రాంతాల్లో ఆందోళనలు అదుపు తప్పడంతో పోలీసులు బలాన్ని ప్రయోగించాల్సి వచ్చింది. ఈ క్రమంలో సుమారు ఐదు వేల మంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఫ్రాన్స్ చరిత్రలోనే నిరసనల తీవ్రతను ప్రతిబింబిస్తోంది. విద్యా వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేసి.. మౌలిక సదుపాయాలను వెంటనే మెరుగుపరచకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తున్నాయి.




మరోవైపు స్పెయిన్‌లో గృహ నిర్మాణ, అద్దెల సంక్షోభం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. నియంత్రణ లేని అద్దెల పెంపు సామాన్య, దిగువ మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తోంది. ఆదాయంలో అధిక భాగం నివాస ఖర్చులకే వెచ్చించాల్సి రావడంతో జీవన ప్రమాణాలు ఘోరంగా పడిపోతున్నాయని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల అద్దెలపై తక్షణమే పరిమితులు విధించాలని.. అద్దెకు ఉంటున్న వారిని యజమానులు అన్యాయంగా ఖాళీ చేయించకుండా చట్టపరమైన రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్పెయిన్‌లోని దాదాపు యాభైకి పైగా నగరాల్లో ఈ తరహా పోరాటాలు కొనసాగుతున్నాయి. వేలాది మంది ఆందోళనకారులు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. విద్య, గృహ వసతి వంటి అత్యంత ప్రాథమిక హక్కుల నిరాకరణ పట్ల పౌరుల్లో వ్యక్తమవుతున్న ఈ అసంతృప్తి కేవలం

తాత్కాలికమైనది కాదని.. ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రాథమిక అవసరాలను తీర్చడంలో అధికార యంత్రాంగాలు విఫలమైనప్పుడు ప్రజలలో కలిగే తీవ్రమైన నిరాశే ఇటువంటి నిరసనలకు మూలకారణం. పరిస్థితి మరింత విషమించక ముందే ప్రభుత్వాలు స్పందించి.. నిరసనకారుల సమంజసమైన డిమాండ్లను చర్చల ద్వారా పరిష్కరించకపోతే.. ఈ ఉద్యమాలు మరింత తీవ్రరూపం దాల్చి దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితులను మరింత ప్రమాదంలో పడేసే అవకాశం ఉంది.

# వారసులకు నో టికెట్ ?



**హైదరాబాద్ పెన్ పవర్:** వారసులు అంటేనే అది ఒక అర్హతగా చాలా మంది ముందుకు వస్తున్నారు. దాంతో పార్టీలో ఏళ్ల తరబడి ఉన్న వారు, అవకాశాల కోసం వేచి చూస్తున్న వారు వెనకబడిపోతున్నారు. అదే సమయంలో పార్టీ కొందరికి మాత్రమే పరిమితం అవుతోంది అన్న చర్చకు కూడా ఆస్కారం ఉంటోంది. అందుకే వారసులకు టికెట్ విషయంలో టీడీపీ స్ట్రాంగ్ డెసిషన్ తీసుకుందని ప్రచారం సాగుతోంది. టీడీపీ మాత్రమే కాదు కూటమి పార్టీలకు కూడా ఇదే రూల్ వర్తించేలా ఉమ్మడి డెసిషన్ చేస్తున్నారు అని కూడా అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఇపుడు పెద్ద ఎత్తున పోటీ పడుతున్న వారసులకు ఈ నిర్ణయం అమలు అయితే మాత్రం నిరాశ తప్పదని అంటున్నారు.

**మేయర్ చుట్టూనే :**

విశాఖ మేయర్ చుట్టూ వారసులు పోటీ మామూలుగా లేదు, కేవలం ముగ్గురు నేతలు తప్పించి ఉమ్మడి విశాఖ జిల్లాలో దాదాపుగా అంతా కూడా తమ వారి కోసం విపరీతంగా ప్రయత్నాలు చేస్తున్నారు అని అంటున్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, అలాగే జనసేనకు చెందిన పెందుర్తి అనకాపల్లి ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, కొణతాల రామకృష్ణ మాత్రమే ఈ వారసులని తీసుకుని రావడం లేదు. వారి నుంచి మాత్రమే ఎలాంటి సిఫార్సులు లేవని అంటున్నారు. వీరు తప్పించి మిగిలిన వారు అంతా తమ కుటుంబాలలో సతీమణినో అన్న దమ్ములనో కుమారుడు లేదా కుమార్తెలనో మేయర్ కుర్చీ కోసం పోటీకి పెట్టాలని తపిస్తున్నారు అని ప్రచారం సాగుతోంది.

**అడ్డుకట్ట పడినట్లే :**

కూటమి పార్టీలు కనుక ఉమ్మడిగా వారసులకు నో టికెట్ అన్న కీలక నిర్ణయం తీసుకుంటే మాత్రం వారికి అడ్డుకట్ట పడుతుందని అంటున్నారు. అంతే కాదు మేయర్ రేసులో ఉన్న వారిలో సగానికి సగం మంది పక్కకు తప్పుకున్నట్లు అవుతుందని అంటున్నారు. అసలు ఇలా ఎందుకు కూటమి పార్టీలు ఆలోచన చేస్తున్నాయంటే ఒకరి వారసులకు ఇస్తే మరో నేత తమ వారికి ఇవ్వలేదని అసంతృప్తి చెందే చాన్స్ ఉంటుంది. అది నాయకుల మధ్య పార్టీల మధ్య సమస్యగా మారుతుంది. అలాగే కార్యకర్తలు సైతం తీవ్ర అసంతృప్తి చెందుతారు. పార్టీ కోసం కష్టపడిన ద్వితీయ తృతీయ శ్రేణి నేతలు కూడా అసహనానికి లోను అవుతారు. అందుకే వీటికి చెక్ చెప్పేందుకే ఈ డెసిషన్ తీసుకుంటున్నారు అని అంటున్నారు.

**కొత్త వారికే :**

ఇక జీవీఎంసీలో మేయర్ తో పాటు 120 వార్డులలో అత్యధిక శాతం పార్టీలో యువతకు కొత్త తరానికి అవకాశం ఇవ్వాలని కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. దాని వల్ల నాయకత్వం పెరగడమే కాకుండా జనంలోనూ సానుకూలత ఏర్పడుతుందని పార్టీల విజయానికి అది కారణం అవుతుందని కూడా అంచనా వేస్తున్నారు. అలా బహుముఖీయమైన ప్రయోజనాలను ఆశించి వారసులకు చెక్ చెప్పబోతున్నారు అని అంటున్నారు. మరో వైపు చూస్తే కేవలం విశాఖ మేయర్ కే కాకుండా రాష్ట్రంలో వీలైనంత మేర వారసులను దూరంగా పెట్టాలని కూడా కూటమి పార్టీలు ఆలోచన చేస్తున్నాయని అంటున్నారు. దీని వల్ల స్థానిక సంస్థలలో యువతకు మహిళలకు అలాగే సమర్థ నేతలకు మరిన్ని అవకాశాలు దక్కుతాయని అంటున్నారు. ఒక విధంగా ఇది మంచి నిర్ణయం అని అంతా స్వాగతిస్తున్నారు. ఒక నాయకుడి ఇంటికే పదవులు అన్నీ వెళ్లడం కంటే అధికారం వికేంద్రీకరణ జరగడం అర్హులకు అందలాలు దక్కడమే అసలైన ప్రజాస్వామ్యం అని అంటున్నారు.

# ఏపీ కూటమి సర్కారుకు అదే 'అభయం'!



**హైదరాబాద్ పెన్ పవర్:** అన్ని కాంబినేషన్లు సూపర్ హిట్ కావు. సినిమాల సంగతి ఎలా ఉన్నా రాజకీయాలు అందుకు పూర్తి భిన్నం. రెండు రాజకీయ పార్టీలు కలిసి భాగస్వామ్యంతో ప్రభుత్వాన్ని నడపటం అంత తేలికైన విషయం కాదు. ఏపీలో అయితే ఏకంగా మూడు పార్టీలు. అది కూడా మిగిలిన మూడు భిన్నమైన పార్టీ. నిజానికి ఈ పార్టీల మధ్య పొత్తే ఒక విచిత్రం. ఎందుకంటే భావసారూప్యతల సంగతి పక్కన పెడితే.. ఈ మూడు పార్టీల అధినేతలు మినహాయించి.. నేతలు.. క్యాడర్.. చివరకు ఈ పార్టీల మద్దతుదారులు.. సానుభూతిపరుల మధ్య కూడా కలిసిమెలిసి ఉన్నట్లుగా కనిపించదు. మూడు పార్టీల అగ్రనేతలు మినహాయించి.. మిగిలిన వారి మధ్యన అభిప్రాయభేదాలకు కొదవ లేదు. ఈ కారణంగానే.. తమ మధ్య ఉన్న దూరాన్ని అధినేతలకు అపాదించే క్రమం కనిపిస్తూ ఉంటుంది. ఇక్కడే ఏపీ కూటమి పార్టీ మధ్య ఒక ఆసక్తికర మేజిక్ కనిపిస్తుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఇప్పటివరకు ప్రతి మూడు నెలలకు ఒక ప్యాట్రన్ కొట్టొచ్చినట్లు కనిపిస్తూ ఉంటుంది. మీడియా.. సోషల్ మీడియా.. వాట్సప్ గ్రూపుల్లో కూటమి పార్టీలు ముఖ్యంగా తెలుగుదేశం –జనసేన మధ్య పొరపొచ్చాలు మొదలయ్యాయని.. టీడీపీ అధినాయకత్వం తీరు మీద జనసేనాని గుర్రుగా ఉన్నారని చెబుతూ.. దానికి రెండు మూడు అంశాల్ని సాక్ష్యంగా చూపిస్తూ చర్చలు మొదలు పెడతారు. అది అంతకంతకూ పెరుగుతూ ఉంటుంది. కొద్ది రోజులకు అదేమీ లేదన్నట్లుగా ఏదో ఒక కార్యక్రమంలోనూ.. మరే సందర్భంలోనో చంద్రబాబు, పవన్ మధ్య ఆత్మీయ అనుబంధం అలానే కొనసాగుతుందన్నది స్పష్టమవుతుంది. అంతేకాదు.. పవన్.. లోకేశ్ మధ్య కూడా వేలెత్తి చూపించేలా వ్యవహారశైలికి సంబంధించిన సాక్ష్యాలు ఉండకపోవటం.. జరుగుతున్న ప్రచారానికి భిన్నంగా వారిద్దరూ ఆత్మీయంగా కలిసి ఉండటం కనిపిస్తుంది. కూటమి సర్కారులో సూపర్ పవర్ గా పేర్కొనే లోకేశ్.. జనసేనానితో మాత్రం ఒదిగి ఉంటారు. నిజంగానే అన్న ఉంటే.. తమ్ముడు ఎలా బిహేవ్ చేస్తాడో.. అలానే పవన్ ముందు లోకేశ్ తీరు ఉంటుంది. ఇక్కడే మరో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. నిజానికి ఈ తీరే కూటమి సర్కారుకు శ్రీరామరక్షగా చెప్పాలి. చంద్రబాబు.. పవన్ కల్యాణ్ మధ్య బంధం కూడా ఎంతో మెచ్యూర్డ్ గా కనిపిస్తుంది. కొన్ని అంశాల విషయంలో చంద్రబాబు పాలన మీద పవన్ కు విభేదాలు ఉన్నా.. వాటిని బయటకు రానివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. అదేసమయంలో పవన్ కల్యాణ్ మనసుకు నొచ్చుకునేలా వ్యవహరించేందుకు చంద్రబాబు సుతారం ఇష్టపడని తత్త్వం కనిపిస్తుంది. అందుకే ఆచితూచి అన్నట్లుగా వ్యవహరిస్తారు. కూటమి సర్కారులో పవన్ కల్యాణ్ కు ప్రాధాన్యత తగ్గుతుందన్న మాట తరచూ వినిపించే క్రమాన్ని వెంటనే గుర్తించటం.. దానికి ఫుల్ స్టాప్ పెట్టేలా చంద్రబాబు చేతల్లో చూపించటం కనిపిస్తుంది. ఇక్కడే మరో అంశాన్ని ప్రస్తావించాలి. గతంలోనూ పలు పార్టీల భాగస్వామ్యంతో పని చేసిన సందర్భాలు ఉన్నాయి. అన్ని సందర్భాల్లోనూ తనకున్న బలాన్ని ప్రదర్శించేందుకు చంద్రబాబు వెనుకాడేవారుకాదు. కానీ.. కూటమి సర్కారులో అలా కాదు. తనకున్న బలం కంటే కూడా పవన్ తో ఉన్న బంధానికే అధిక ప్రాధాన్యత ఇవ్వటం కనిపిస్తుంది. పవన్ సైతం తనకున్న బలం.. తన పార్టీకి ఉన్న శక్తిసామర్థ్యాలు.. తన ప్రత్యర్థికి, తనకు ఉన్న తేడాను గుర్తించే విషయంలో ప్రాక్టికల్ గా ఉండటం కూడా కూటమి సర్కారు సాఫీగా సాగేందుకు సాయం చేస్తుందని చెప్పాలి. చేతి వేళ్లు ఒకేలా ఉండవన్న విషయాన్ని చంద్రబాబు.. పవన్ కల్యాణ్.. లోకేశ్ లు పూర్తిగా ఏకీభవించటమే కాదు.. అలా లేకపోవటం లోపం కాదు.. అదో సానుకూలాంశమన్న విషయాన్ని బలంగా నమ్ముతారు. వేళ్లన్ని ఒకేలా ఉండకపోవటమే అసలుసిసలు బలమన్నట్లుగా.. కూటమిలోని భిన్నత్వమే వారిని ఏకం చేస్తుందన్న విషయాన్ని మర్చిపోకూడదు. కూటమి సర్కారులోని భాగస్వామ్య పక్షాలన్నికూడా తమ బలాలు.. బలహీనతలు మాత్రమే కాదు.. తామంతా కలవటానికి కారణమైన అంశాల్ని మర్చిపోకపోవటమే అసలుసిసలు మేజిక్ గా చెప్పాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# రాజకీయం: 2021 గాయాన్ని తవ్వుతున్నారు..!



రాజకీయం.. రాజకీయమే... అన్నట్టుగా బీజేపీ వ్యవహరిస్తోంది. ప్రత్యర్థులను వేటాడి వెంటాడడంలో బీజేపీ తన విధానాలను కొనసాగిస్తోం ది. ఈ క్రమంలో తాజాగా 2021.. అంటే దాదాపు ఐదేళ్ల కిందట జరిగిన ఓ ఘటనపై విచారణకు ఆదేశించడం దేశం మొత్తాన్నీ నివ్వెర పోయేలా చేసింది. వాస్తవానికి ఆ వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవడం.. తప్పు చేశారని భావించిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవడం.. వంటి అయిపోయాయి. నిజానికి నాడు ఏం జరిగిందన్న విషయాన్ని కూడా ప్రజలు దాదాపు మరిచిపోయారు. కానీ.. బీజేపీ మాత్రం నాటి ఘటనను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు.. ప్రత్యర్థులను మరింత ఇరకాటంలోకి నెట్టేందుకు ప్రయత్నం చేస్తోంది.

**విషయం ఏంటి?**

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. బీజేపీ ఆవిర్భవించిన తర్వాత.. తొలిసారి పశ్చిమ బెంగాల్‌లో ఆ పార్టీ ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకుంది. దీంతో ప్రత్యర్థులను వేటాడుతోందన్నది రాజకీయంగా వస్తున్న విమర్శలు నిన్న మొన్నటి వరకు పశ్చిమ బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీ పార్టీ తృణమూల్‌లో కల్లోలం రేగడం.. ఈ పార్టీ చీలిపోవడం.. అసలు ఎవరికీకాకుండా పోవడం కూడా తెలిసిందే. అంతేకాదు.. మమత పరిస్థితి ఇప్పుడు దారుణంగా కూడా తయారైంది. దీంతో –ప్రత్యర్థి– అనే మాటే ప్రభుత్వానికి వినిపించడం లేదు. అయితే.. –ఇది చాలదు– అన్నట్టుగా బీజేపీ వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి.

మమతా బెనర్జీకి సింపతీ కూడా దక్కకుండా.. ఆమెను రాజకీయంగా మరింత డైల్యూట్ చేయడంతోపాటు.. పేదలు, మహిళల్లో ఉన్న కొద్దిపాటి సానుభూతిని కూడా కనుమరుగయ్యేలా చేయాలన్నది కమల నాథుల లక్ష్యమని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ క్రమంలోనే 2021లో జరిగిన ఘటనపై తాజాగా ముఖ్యమంత్రి సువేందు అధికారి ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. ఒకవైపు పోలీసులతోను, మరోవైపు వైద్య శాఖ అధికారులతోనూ కూడా రెండు విచారణలు చేయించనున్నట్టు ఆయన ప్రకటించారు. ––నాటి గాయం తాలూకు నిజాన్ని తేలుస్తాం.–– అని కఠిన వ్యాఖ్యలు చేయడం వెనుక మమతను కార్నర్ చేశారని కొందరు వ్యాఖ్యానించారు.

**అప్పట్లో ఏం జరిగింది?**

2021లో పశ్చిమ బెంగాల్ ఎన్నికలు జరుగుతున్న సమయంలో సీఎంగా ఉన్నమమతా బెనర్జీ.. తనపై కొందరు దాడి చేశారని.. దీంతో కాలికి గాయం అయిందని పేర్కొన్నారు. ఇది అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇక, ఆ గాయానికి కట్టుకుని ఆమె అలానేఎన్నికల ప్రచారంలో వీల్ చైర్ సాయంతోనే పాల్గొన్నారు. అయితే.. దీనిపై విమర్శలు రావడంతో కేంద్ర ఎన్నికల సంఘమే అప్పట్లో విచారణకు ఆదేశించింది. దీనిని విచారించిన అధికారులు అది దుండగులు చేసిన గాయం కాదని.. పొరపాటు మమత కాలు బెణికిందని తెలిపారు. నివేదికలు కూడా ఇచ్చారు. అయితే.. ఆమె కాలికి గాయం అయిందంటూ.. ప్రచారం చేసిన అధికారులు, సర్టిఫికెట్ ఇచ్చిన వారిపై చర్యలు తీసుకున్నారు. దీంతో కథ ముగిసింది. ఆ సెంటిమెంటుతో మమత మరోసారి విజయం దక్కించుకున్నారు. అయితే.. తాజాగా నాటి కేసును వెలికి తీయాలని.. ఏం జరిగిందో ప్రజలకు చెప్పాలని.. మోసకారులను(పరోక్షంగా మమత) సహించేది లేదని సీఎం సువేందు వ్యాఖ్యానించడం గమనార్హం.

## పైలెట్ స్మిత్ కు ఇజ్రాయెల్ అరుదైన గౌరవం.. తమ దేశానికి రావాలని నెతన్యాహు ఆహ్వానం..

ఫ్లైదుబాయ్ విమానంలో ఆ కొన్ని నిమిషాలు.. వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలను ఫణంగా పెట్టిన క్షణాలు. కాక్‌పిట్‌లోనే దాడికి గురైన భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్.. తీవ్ర గాయాలతోనూ పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి చేసిన ప్రయత్నం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో జరిగిన సంభాషణలో ఆయన చెప్పిన వివరాలు ఆ ఘటన ఎంత భయానకంగా సాగిందో వెల్లడించాయి.

**ప్రార్థన చేస్తాడనుకున్నా.. ఒక్కసారిగా దాడి**

ఫ్లైదుబాయ్ విమానం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తోంది. విమానం గాల్లో ఉండగానే స్మిత్ మచ్చర్‌పై సహ పైలట్ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు ముందు సహ పైలట్ ప్రార్థన చేశాడని స్మిత్ తెలిపారు. ఆ తర్వాతే పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. వెనుక నుంచి తనపై దాడి జరిగిందని.. మొదటి దెబ్బకే తన చూపు దాదాపుగా కోల్పోయానని స్మిత్ నెతన్యాహుకు వివరించారు.

**విమానం కిందకు వెళ్తోంది.. కానీ తాను కూడా ప్రమాదంలోనే..**

దాడితో స్మిత్ తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో విమానం కూడా కిందకు దిగుతున్నట్లు ఆయన గుర్తించారు. ఒకవైపు తన ప్రాణాలకు ముప్పు.. మరోవైపు విమానంలోని ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడటం.. అలాంటి సమయంలో స్మిత్ ముందు ఉన్న ప్రధాన లక్ష్యం ఒక్కటే కాక్‌పిట్ తలుపు తెరవాలి. అయితే తలుపు తెరవడానికి చేసిన తొలి ప్రయత్నాన్ని సహ పైలట్ అడ్డుకున్నాడు. కాక్‌పిట్ డోర్‌ను మూసివేశాడు. గాయాలతో చూపు సరిగా కనిపించని పరిస్థితిలోనూ స్మిత్ మరోసారి ప్రయత్నించారు.

**చివరి శక్తినంతా ఉపయోగించి డోర్ తెరిచారు**

తన దగ్గర మిగిలిన శక్తినంతా ఉపయోగించి చివరకు కాక్‌పిట్ తలుపును తెరిచినట్లు స్మిత్ వెల్లడించారు. తలుపు తెరుచుకున్న వెంటనే బయట ఉన్న ప్రయాణికులు, సిబ్బంది లోపలికి చేరుకున్నారు. దాడి చేసిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకోవడంతో పరిస్థితి క్రమంగా నియంత్రణలోకి వచ్చింది. అనంతరం విమానాన్ని సురక్షితంగా దారి మళ్లించి అత్యవసర ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. అంటే.. ప్రయాణికులను కాపాడిన కీలక మలుపు కాక్‌పిట్ తలుపు తెరుచుకున్న క్షణమే.

**'మీరు ప్రపంచానికే హీరో'**

స్మిత్ మచ్చర్ చెప్పిన ఈ వివరాలను విన్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆయన ధైర్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. భారత్, ఇజ్రాయెల్‌తో పాటు ప్రపంచానికే స్మిత్ హీరో అని కొనియాడినట్లు సమాచారం. అంతేకాదు ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయనను ఆహ్వానించారు. ఆ కార్యక్రమంలో సంప్రదాయంగా ప్రత్యేక గౌరవంగా నిర్వహించే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించాలని నెతన్యాహు ఆకాంక్షించినట్లు తెలుస్తోంది.

**మోదీతోనూ సంభాషణ**

ఈ ఘటన తర్వాత భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా స్మిత్ మచ్చర్‌తో మాట్లాడి ఆయన ధైర్యాన్ని అభినందించారు. తీవ్ర గాయాల మధ్య కూడా ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు తీసుకున్న నిర్ణయాలను ప్రశంసించారు. ఇక స్మిత్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతున్నట్లు సమాచారం.

**అసలు హీరో ఎవరు?**

ఈ ఘటనలో స్మిత్ మచ్చర్‌కు వస్తున్న ప్రశంసలకు కారణం కేవలం ఆయన పైలట్ కావడం కాదు. తన ప్రాణం ప్రమాదంలో ఉందని తెలిసినా.. విమానం అదుపు తప్పుతోందని గుర్తించి.. గాయాలతోనూ కాక్‌పిట్ తలుపు తెరవడానికి చివరి ప్రయత్నం చేయడమే ఆయనను హీరోగా నిలబెట్టింది. ఒక సాధారణ విమాన ప్రయాణం.. కొన్ని నిమిషాల్లో ప్రాణాంతక సంక్షోభంగా మారింది. ఆ సమయంలో స్మిత్ తీసుకున్న నిర్ణయాలు వందలాది మంది ప్రయాణికుల భవిష్యత్తును మార్చేశాయి.

అందుకే ఇప్పుడు ఆయన కథలో ప్రధానమైన ప్రశ్న ఒక్కటే "అంతటి దాడి తర్వాత కూడా.. చివరి శక్తి వరకు పోరాడే ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది?" దానికి స్మిత్ చర్యలే సమాధానంగా నిలిచాయి.

# మందు తాగడంతో దేశంలో తెలంగాణోళ్లే టాప్.. అట్లుంటదీ మరి మనోళ్లతోని..



మందు తాగడంలో.. బాటిల్ ఎత్తడంలో తెలంగాణోళ్లను కొట్టేటోడే లేడని మరోసారి నిరూపితమైంది. "అట్లుంటది మరి మనోళ్లతోని" అంటూ కాలర్ ఎగరేసేలా మన మందుబాబులు ఏకంగా జాతీయ రికార్డులను బద్దలు కొట్టేశారు. ఏ ప్రతిష్టాత్మక అవార్డుల్లోనో.. పతకాల పట్టికలోనో అనుకుంటే పొరపాటే.. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్.ఎఫ్.హెచ్ఎస్–6) వెల్లడించిన మద్యపాన గణాంకాల జాబితాలో మన రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.సర్వే వివరాల ప్రకారం.. తెలంగాణలో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో ఏకంగా 43.9 శాతం మంది రెగ్యులర్‌గా మద్యం సేవిస్తూ "మేము సైతం" అంటున్నారు. దేశవ్యాప్తంగా ఇదే వయసున్న పురుషుల సగటు మద్యం వినియోగం కేవలం 18.9 శాతమే ఉంటే.. మనోళ్లు మాత్రం దానికి రెండింతలకు పైగా స్కోర్ చేసి జాతీయ సగటుని తేలిగ్గా దాటేశారు. మద్యం ప్రియుల పోటీలో 42.2 శాతంతో రాజస్థాన్ రెండో స్థానంతో సరిపెట్టుకోగా ఛత్తీస్‌గఢ్ (38.3%), జార్ఖండ్ (33.6%), మధ్యప్రదేశ్ (26.9%) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

**పట్టణాల కన్నా పల్లెటూర్లలోనే 'కిక్కు' ఎక్కువ!**

నగరాల్లోనే పబ్‌లు, బార్ల గోల ఎక్కువనుకుంటే పొరపాటే. అసలైన "సిట్టింగ్" కిక్కు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉందట. పట్టణాల్లో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో మద్యం వినియోగం 36.3 శాతంగా ఉంటే.. పల్లెల్లో అది ఏకంగా 46.6 శాతానికి చేరుకుంది. అంటే నగరాల కంటే పల్లెటూర్లలోనే మరో 10 శాతం మంది ఎక్కువగా మద్యం తుఫానులో మునిగితేలుతున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కాలేయాన్ని ఎంత గట్టిగా కాపాడుకోవాలో ఈ రికార్డులు చూస్తేనే అర్థమవుతోంది.

**మహిళల్లోనూ రెండవ స్థానం..**

ఇక ఈ విభాగంలోనూ మేము తక్కువ తినలేదన్నట్లుగా మహిళల కేటగిరీలోనూ తెలంగాణ 7.1 శాతంతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. 19.9 శాతంతో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉంటే ఛత్తీస్‌గఢ్ (5.7%), జార్ఖండ్ (5.5%) మన వెనుకే ఉన్నాయి.మొత్తానికి వినోదం, సంబరాలు, చిన్నపాటి దావత్‌లను కూడా గ్లాస్ లేకుండా పూర్తి చేయలేకపోవడం మన స్థానిక సంస్కృతిలో భాగమైపోయిందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. అయితే కాలర్ ఎగరేసుకునే ఈ రికార్డు వెనుక కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఛిద్రమవ్వడం, ఆరోగ్యం గుల్లకావడం లాంటి చేదు నిజాలు దాగి ఉన్నాయి. ఇకనైనా ప్రభుత్వాలు జాగరూకతతో విచక్షణారహిత అమ్మకాలపై, ఆరోగ్యంపై దృష్టి సారించకపోతే.. ఈ 'కిక్కు' చివరికి పెద్ద దెబ్బే తీసేలా ఉంది.

# చిన్న ఒవైసీకి ఏమైంది? 55 ఏళ్లకే ఇంత వైరాగ్యమా?



55 ఏళ్లు వచ్చేశాయి.. ముసలివాడినయ్యా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను.. శేష జీవితాన్ని మక్కాలో గడిపేస్తా.. ఇలా అనూహ్య రీతిలో మాట్లాడి.. వార్తల్లోకి వచ్చారు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తమ్ముడు కం మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ. ప్రస్తుతం చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన తాజాగా బండ్లగూడలోని బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ లో జరిగిన కార్యక్రమానికి హాజరైన సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భం ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. ఎందుకంటే.. 55 ఏళ్లు అన్నది రాజకీయాల్లో ఏ మాత్రం పెద్ద వయసు కాదు. కానీ.. రిటైర్మెంట్ కావటానికి తాను సిద్ధంగా ఉన్న విషయాన్ని అక్బరుద్దీన్ స్పష్టం చేయటంతో.. ఎందుకిలా? అక్బరుద్దీన్ కు ఏమైంది? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది.తమకు చెందిన కాలేజీలో ఇంటర్ పాసైన విద్యార్థులకు ధ్రువపత్రాల్ని పంపిణీ చేసే సందర్భంలో తాను ప్లస్ టూ వరకు చదివానని చెప్పేందుకు తాను ఏ మాత్రం సిగ్గుపడనని చెప్పిన ఆయన.. ఆకాశాన్నంటే ఒవైసీ విద్యా సంస్థల భవనాల్ని తాను నిర్మించానని చెబుతూ.. 'కొందరు నా పరువుతో ఆటలాడుకుంటున్నారు. ఇబ్బందులు క్రియేట్ చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఎవరి ముందూ తలవంచే ప్రసక్తే లేదు. ఈ దేశం అందిరిదీ. అందరికీ సమాన హక్కులు ఉన్నాయి. నేను ఉన్నా లేకుననా ఒవైసీ విద్యాసంస్థల భవనాల్లో నా గళం శాశ్వతంగా నిలిచిపోతుంది" అంటూ భావోద్వేగంతో మాట్లాడిన ఆయన.. తన రిటైర్మెంట్ అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించటం ఆసక్తికరంగా మారింది.తనకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై తనకు స్పష్టత లేదని చెబుతూ.. తాను పోటీ చేస్తానో లేదో? అన్న సందేహాన్ని వ్యక్తం చేస్తూ.. "నాకిప్పుడు యాభై ఐదేళ్లు. ముసలివాడినయ్యా. బహుశా పోటీ చేయకపోవచ్చు' అంటూ చేసిన వ్యాఖ్యల్ని చూస్తే.. రాజకీయాల్లో 55 ఏళ్లు అన్నది మధ్య వయస్కుడిగా వ్యవహరిస్తారు. అంతేకాదు.. తాను అన్నింటిని వదిలేసి.. మక్కాలోనే ఉండాలని ఉందని.. అక్కడే కన్నుమూయాలన్నదే తన కోరికగా చెప్పిన వ్యాఖ్యలు ఇప్పుడు మజ్లిస్ కార్యకర్తలకు షాకింగ్ గా మారాయి. అక్బరుద్దీన్ తండ్రి సుల్తాన్ సలాహుద్దీన్ ఒవైసీ సంగతే తీసుకుంటే.. 72 ఏళ్ల వయసులోనూ రాజకీయాలు చేశారు. అందుకు భిన్నంగా చిన్న ఒవైసీ ఎందుకిలాంటి వ్యాఖ్యలు చేశారు? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది.మజ్లిస్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం అక్బరుద్దీన్ తన కుమారుడ్ని తన రాజకీయ వారసుడిగా తెర మీదకు తీసుకొచ్చే ఉద్దేశంతోనే ఇదంతా చేస్తున్నట్లు చెబుతున్నారు. ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉండటం.. కొడుకును రాజకీయాల్లోకి ఎంట్రీ ఇప్పించటం ద్వారా తాను రిటైర్మెంట్ కావాలన్న ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఒవైసీ కుటుంబం నుంచి నాలుగో తరం రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. నిజానికి 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేసిన అక్బరుద్దీన్ ఒవైసీ.. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా తన కొడుకు (డాక్టర్ నూరుద్దీన్ ఒవైసీ) చేత డమ్మీ నామినేషన్ దాఖలు చేశారు. సాంకేతికంగా ఏదైనా సమస్యలు ఎదురైతే.. పనికి వస్తుందని ఇలా చేశారు. పోటీకి ఎలాంటి సమస్యలు రాకపోవటంతో కొడుకు నామినేషన్ ను ఉపసంహరించుకున్నారు. అయితే.. ఈ విషయాలేవీ అప్పట్లో అంతగా ఫోకస్ కాలేదు.

ఇక అక్బరుద్దీన్ ఒవైసీ కొడుకు (నూరుద్దీన్ ఒవైసీ) విషయానికి వస్తే 26 ఏళ్ల వయసున్న ఇతను డాక్టర్. ఎంబీబీఎస్ పూర్తి చేసి.. ఎండీ అనస్థీషియా చదివిన ఇతను కొంతకాలంగా సలార్ –ఇ–మిల్లత్ విద్యా సంస్థల బాధ్యతల్ని చూసుకుంటున్నాడు. తండ్రితో పాటు డమ్మీ నామినేషన్ వేసిన ఇతను.. 2024 లోక్ సభ ఎన్నికల వేళ.. తన పెదనాన్నకు మద్దతుగా చురుకుగా ప్రచారాన్ని నిర్వహించాడు. అక్బరుద్దీన్ ఒవైసీకి ఒక కుమార్తె, కుమారుడు. ఇటీవలే కుమార్తె పెళ్లి లండన్ లో జరిగింది. అక్బరుద్దీన్ కొడుకు విషయానికి వస్తే ఇతనిపై ఎలాంటి కేసులు లేవు. క్లీన్ హిస్టరీగా చెప్పొచ్చు. ఓవైపు వెంటాడుతున్న ఆరోగ్య సమస్యల నేపథ్యంలో కొడుక్కి రాజకీయ వారసుడిగా తెర మీదకు తీసుకొచ్చి.. బాధ్యతలు అప్పజెప్పేసే ఆలోచనలో ఉన్నట్లుగా చెబుతున్నారు. అదే జరిగితే చాంద్రాయణగుట్ట నుంచి కానీ చార్మినార్ నుంచి కానీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది. అదే జరిగితే విజయవంతంగా ఒవైసీ నాలుగో తరం రాజకీయాల్లోకి వచ్చేసినట్లు అవుతుంది.

# పాక్ చేతికి చైనా 5వ జెన్ విమానాలు.. భారత్ కు ఆందోళన.. మనకు ఎప్పటికి?

కొద్దికాలంగా భారత్–పాకిస్తాన్ సరిహద్దుల్లో వైమానిక ఆధిపత్యం సాధించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత వైమానిక దళ అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ దీనిపై కీలక వ్యాఖ్యలు చేశారు. వైమానిక దళ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వార్షిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చైనా తయారు చేస్తున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాలను పాకిస్తాన్ కొనుగోలు చేయడం భారత్‌కు తీవ్ర ఆందోళన కలిగించే విషయమని స్పష్టం చేశారు. దేశ సరిహద్దు భద్రత దృష్ట్యా ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లు, వాయుసేన కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై ఐఏఎఫ్ చీఫ్ సమగ్రంగా మాట్లాడారు.భారత వాయుసేనలో ప్రస్తుతం తీవ్రంగా వేధిస్తున్న ఫైటర్ జెట్ల కొరతపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. దేశ భద్రతా అవసరాల ప్రకారం వాయుసేన వద్ద కనీసం 42 ఫైటర్ స్క్వాడ్రన్లు ఉండాల్సి ఉండగా మిగ్–21 విమానాలను దశలవారీగా తొలగించడం వల్ల ప్రస్తుతం ఈ సంఖ్య కేవలం 29 స్క్వాడ్రన్లకు పడిపోయిందని తెలిపారు. ఒక్కో స్క్వాడ్రన్‌లో 18 యుద్ధ విమానాలు ఉంటాయని పేర్కొన్న ఆయన రాబోయే రోజుల్లో స్క్వాడ్రన్ల సంఖ్య మరింత తగ్గిపోకుండా చూడాలంటే భారత్ ప్రతి ఏటా 36 నుండి 40 కొత్త యుద్ధ విమానాలను, అంటే సుమారు రెండు స్క్వాడ్రన్లను వాయుసేనలో చేర్చుకోవాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఉన్న లోటును భర్తీ చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలకు సరిపడా అదనపు విమానాలను సమకూర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని



ఆయన అభిప్రాయపడ్డారు.ఫైటర్ జెట్ల కొరతను అధిగమించడానికి బహుళ రకాల ప్రాజెక్టులపై భారత్ దృష్టి సారించిందని ఎయిర్ చీఫ్ మార్షల్ వెల్లడించారు. 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందం ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఖరారయ్యే అవకాశం ఉందన్న ఆయన ప్రస్తుతం ధరతో పాటు ఇతర కీలక అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. దీంతో పాటు స్వదేశీ రక్షణ ఉత్పత్తులైన తేజస్ ఎంకే–1ఏ, తేజస్ ఎంకే–2 , ఐదో తరం తేలికపాటి విమానం ఆమ్కా ప్రాజెక్ట్‌లు వాయుసేనకు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. అదే సమయంలో రష్యా నుంచి ఐదో తరం ఎస్.యూ–57 యుద్ధ విమానాలను కొనుగోలు చేసే అంశంపై ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని.. సామర్థ్యం, ఇతర ప్రత్యామ్నాయాలను సమీక్షించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

రక్షణ రంగ ప్రాజెక్టులలో జరుగుతున్న జాప్యంపై ఐఏఎఫ్ చీఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సాంకేతిక అభివృద్ధి, ఉత్పత్తి ప్రక్రియలు సుదీర్ఘకాలం సాగితే అప్పటికే ప్రత్యర్థి దేశాలు అదే సాంకేతికతను అధిగమించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా "టెక్నికల్ డిలే అంటే టెక్నాలజీని తిరస్కరించడమే" అని ఆయన వ్యాఖ్యానించారు.

మరోవైపు పాకిస్తాన్–చైనా మధ్య పెరుగుతున్న సైనిక సహకారాన్ని భారత్ నిశితంగా గమనిస్తోందని.. అయితే కొత్తగా కొనుగోలు చేసే ఐదో తరం విమానాలను పాకిస్తాన్ తన వద్ద ఉన్న పాత యుద్ధ వ్యవస్థలతో సరిగ్గా అనుసంధానించుకోలేకపోతే వాటి పూర్తి సామర్థ్యాన్ని ఉపయోగించడం కష్టమవుతుందని విశ్లేషించారు. భవిష్యత్ యుద్ధాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్లు, లాయిటరింగ్ మ్యూనిషన్స్, అంతరిక్ష ఆధారిత వైమానిక సామర్థ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని చెబుతూ ప్రత్యేక డ్రోన్ ఫోర్స్ ఏర్పాటు చేయడం కంటే ఉన్న సైనిక వ్యవస్థల్లోకే డ్రోన్లను సమర్థంగా అనుసంధానించడమే ఐఏఎఫ్ ప్రధాన వ్యూహమని వివరించారు.

# టీవీలో ఈ షో వస్తోందంటే చాలు.. ఆ రోజుల్లో జనం ఇళ్లలో టీవీలు బంద్ చేసేవాళ్లు ! ఎందుకో తెలుసా?





ఒకప్పుడు మన దేశంలో వినోదానికి, వార్తలకు దూరదర్శన్ మాత్రమే ఏకైక ఆధారం. ఆ రోజుల్లో టీవీలో వచ్చే కొన్ని కార్యక్రమాల కోసం జనం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసేవారు. ఆ కాలంలో రామాయణం, మహాభారతం, శక్తిమాన్ వంటి సీరియల్స్ వస్తున్నాయంటే చాలు, వీధుల్లో జనం ఉండేవాళ్ళు కాదు, అందరూ టీవీల ముందు వచ్చి కూర్చునేవాళ్ళు. అయితే, ఇదంతా ఒక ఎత్తైతే... దూరదర్శన్‌లో ఒక ప్రత్యేకమైన కార్యక్రమం వస్తే మాత్రం, చాలామంది వెంటనే టీవీలను ఆపేసేవారట! అదే 'క్రిషి దర్శన్' అనే కార్యక్రమం.

**టీవీలు ఎందుకు ఆపేసేవారు?**

'క్రిషి దర్శన్' ప్రోగ్రాం అనౌన్స్‌మెంట్ రాగానే చాలామంది టీవీ కట్టేయడానికి కారణం దానిలోని విషయమే. ఈ షో పూర్తిగా వ్యవసాయం, రైతులు, పంటలు, ఆధునిక సాగు పద్ధతుల గురించే ఉండేది. ఇందులో ఒక యాంకర్, ఒక వ్యవసాయ నిపుణుడు కలిసి కూర్చుని, దేశంలోని రైతులకు వ్యవసాయ మెలకువలు, సలహాలు చెప్పేవేవారు. వినోదం కోసం ఎదురుచూసే సాధారణ ప్రేక్షకులకు ఇది కాస్త బోరింగ్‌గా అనిపించడంతో, ఆ టైమ్‌లో టీవీలు బంద్ చేసేవారు. కానీ, మన దేశంలోని రైతన్నలకు మాత్రం ఇది ప్రాణంతో సమానం. వారు దీన్ని ఎంతో శ్రద్ధగా చూసి, వ్యవసాయంలో కొత్త పద్ధతులు నేర్చుకునేవారు.

**అరుదైన రికార్డు.. నెం. 1 షో!**

సాధారణ ప్రజలు ఆ సమయంలో టీవీలు ఆపేసినప్పటికీ, రైతుల ఆదరణతో ఈ కార్యక్రమం చరిత్ర సృష్టించింది. గత 59 సంవత్సరాలుగా ఏకధాటిగా ప్రసారమవుతూ వస్తున్న 'క్రిషి దర్శన్', దూరదర్శన్ చరిత్రలోనే అత్యధిక ఎపిసోడ్‌లు ప్రసారమైన కార్యక్రమంగా మొదటి స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు ఈ షో 16 వేలకు పైగా ఎపిసోడ్‌లను పూర్తి చేసుకొని ఒక అరుదైన చారిత్రాత్మక రికార్డును తన పేరున లిఖించుకుంది.

# ఇంద్రియ నిగ్రహం అంటే ఏమిటి.. ఎలా కలుగుతుంది.. ఎలాంటి ఆహారం తినాలి..!





నోటి మీద అదుపు లేకపోవడం వలన చేప.. స్పర్శ మీద నిగ్రహం లేక ఏనుగు.. వినికిడి మీద నిగ్రహం లేక జింక.. కంటి మీద నిగ్రహం లేక మిడత పతనం అయ్యాయి.వాటికి కేవలం ఒక్క ఇంద్రియం మీద నిగ్రహం లేకపోవడం వల్లనే అవి నాశనమైతే... మనిషికి తన పంచేంద్రియాల మీద నిగ్రహం లేదు. అతడి పతనం ఎలా ఉంటుందో ఆలోచించండి. అసలు ఇంద్రియ నిగ్రహం అంటే ఏమిటి..అది ఎలా కలుగుతుంది..దాని కోసం ఎలాంటి ఆహారం తీసుకోవాలి.. అనే విషయాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం. . .! మానవునికి తన కళ్ళ మీద నిగ్రహం లేదు.. ఏవి చూడకూడదో అవే చూస్తున్నాడు. తన చెవుల మీద తనకు నిగ్రహం లేదు, ఏది వినకూడదో అదే వింటున్నాడు. తనకు నోటి మీద నిగ్రహం అసలే లేదు. అనవసరమైనవంతా మాట్లాడుతున్నాడు.మనం పీల్చే వాసనలు మనలో ఉద్రేకాన్ని కలిగించేవిగా.. తమో గుణాన్ని పెంచేవిగనే ఉంటున్నాయి. స్పర్శ విషయంలో కూడా అంతే. మనం స్వీకరించిన ఆహారంలో ఆరవ వంతు మనస్సుగా మారుతుందని ఛాందగ్యోపనిషత్తు చెబుతోంది. ఇంతకీ ఆహరం అంటే ఏంటి.? కేవలం నోటి ద్వారా మాత్రమే తీసుకునేది కాదు. కళ్ళ ద్వారా చూసేది.. చెవుల ద్వారా వినేది.. ముక్కు ద్వారా వాసన పీల్చేది.. స్పృశించేది కూడా మనస్సుగా మారుతోంది అవన్నీ ఆహారమేనని పండితులు చెబుతున్నారు. ఇంద్రియ నిగ్రహం లేనప్పుడు.. నిషిద్ధమైన ఆహారాన్ని స్వీకరిస్తున్నప్పుడు, మంచి ఆలోచనలు మ్మంటే ఎక్కడి నుంచి వస్తాయి. మంచి పనులు చేయమంటే ఎలా చేస్తాము. మన శరీరమంతా అశుద్ధమైన, ధర్మబద్ధం కాని, అనైతికమైన ఆహారంతో ఏర్పడుతోంది, దానితోనే నిండుతోంది. అందుకే సమాజంలో మనుషులు పెడద్రోవ పడుతున్నారు....

ఆత్మ స్థైర్యం ఓ బలవర్ధక పానీయం . అది పిరికితనాన్ని పారదోలుతుంది. విద్యార్జనకు, ఆరోగ్యసాధనకు తోడ్పడుతుంది. భిన్నత్వం గల సమాజంలో ఏకతాభావన సాధించేందుకు తగిన బలాన్ని ఇస్తుంది. ఆధ్యాత్మిక సాధనలో సైతం ముందుకు సాగేందుకు తోడ్పడుతుంది. అందువల్ల జీవితంలో ఉన్నత సోపానాలను అధిరోహించాలనుకునే ప్రతి వ్యక్తి ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకుంటే ఆత్మనిగ్రహం దానికదే సొంతమవుతుంది. ఆత్మనిగ్రహానికి ఆత్మ స్థైర్యానికి అవినాభావ సంబంధం ఉంది. ఆత్మస్థైర్యం ఉన్న మనిషికి ఆత్మ నిగ్రహం ఏర్పడుతుంది. ఆత్మ పట్ల నమ్మకం, విశ్వాసం ,వ్యక్తి ఆత్మ స్థైర్యం లభిస్తుంది. స్వార్థరహితమైన మనసు, ప్రవృత్తి, వ్యాపకం వంటివి మనిషి అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయి.ఏ ప్రలోభాలకూ లొంగని స్వభావం వల్ల మనిషి ఆత్మస్థైర్యాన్ని సంతరించుకుంటాడు.

# ఆధ్యాత్మికం: ఏ రోజు ఏ దేవుడిని పూజించాలి.. నైవేద్యం ఏమి పెట్టాలి.. ఎలాంటి ఫలితం కలుగుతుంది..!

**వారం రోజులు - ఏ రోజు ఏం చేయాలి?మానవుడు ఏ రోజు ఏం చేయాలి?ఏం చేస్తే పుణ్యఫలితం దక్కుతుంది. ఏ రోజు ఏం కార్యాలు చేయాలి..?ఏ దేవున్ని పూజించాలి..? మొదలగు విషయాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం. . .!**






వారానికి ఏడు రోజులు ఈ విషయం అందరికి తెలిసిందే.. ఆదివారంతో ప్రారంభమై శనివారంతో ముగుస్తుంది. అయితే శాస్త్రాలు.. పురాణాల్లో ఏ రోజు ఏం చేయాలి. ఏ దేవుడిని ఎలా పూజించాలో వివరించారు. ఏ రోజు ఏ దేవుడికి పూజ చేస్తే ఎలాంటి పుణ్యఫలితం దక్కుతుందో శివ మహా పురాణంలోని విద్యేశ్వర సంహిత 14వ అధ్యాయం పూర్తిగా వివరించింది. దేవతల ఆశీస్సులు పొందేందుకు ఐదు రకాలుగా పూజ చేయవచ్చని పండితులు చెబుతున్నారు.

**మంత్రాలతో జపం, హోమం, దానం, తపస్సు, సమారాధనలు అనేవే 5 విధాలు.**

సమారాధనం అంటే దేవుడి ప్రతిమ నుంచే వేదిక. ప్రతిమ, అగ్ని, లేక బ్రాహ్మణుడిని షోడశోపచారాలతో పూజించటం ఈ 4 రకాలలో ఒక దానికంటే ఒకటి ఉత్తమమైనది.

పురాణాల ప్రకారం పూజలు మనకున్న 7 వారాలలో ఒక్కొక్క వారం ఒక్కొక్క దేవతకు చేయాల్సి ఉంటుంది.

**ఆదివారం :** ఆదిత్యుడిని, ఇతర దేవతలను, వేద పండితులను పూజించాలి. ఆదిత్య పూజ వల్ల నేత్ర వ్యాధులు, శిరోరోగం, కుష్ఠువ్యాధి తగ్గుతాయి. ఆదిత్యుడిని పూజించి వేద పండితులకు భోజనం పెట్టాలి. ఇలా ఒక రోజు నుంచి ఒక మాసం, ఒక సంవత్సరం లేక 3 సంవత్సరాల పాటు రోగ తీవ్రతనను బట్టి పూజ చేయాలి. దీనివల్ల సూర్యానుగ్రహప్రాప్తి కలుగుతుంది.

**సోమవారం :** సంపద కోరుకోనేవారు సోమవారం లక్ష్మీదేవిని ఆరాధించాలి. ఆ రోజున పూజ తర్వాత వేద పండిత దంపతులకు నెయ్యితో భోజనం పెట్టాలి. పరమేశ్వరుడికి రుద్రాభిషేకం చేయాలి. ఇలా చేయడం వలన క్రమేణ దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుతాయి.

**మంగళవారం :** ఆరోగ్య సమస్యలు తగ్గేందుకు కాళీ దేవతను పూజించాలి. మినుము, కంది, పెసరపప్పులతో చేసిన పదార్థాలతో వేద పండితులకు భోజనం పెట్టాలి. హనుమంతుడికి ఆకుపూజ చేసి వడమాల సమర్పించాలి. ఇబ్బందులు.. కష్టాలు తొలగుతాయి.

**బుధవారం :** పెరుగు అన్నాన్ని విష్ణు దేవునికి నివేదించాలి. ఈ పూజ, నివేదనల వల్ల పూజ చేసిన వారి కుమారులు, మిత్రులు, భార్య తదితరులకు చక్కటి ఆరోగ్యం ప్రాప్తిస్తుంది. జీవితం సాఫీగా సాగుతుంది. ఆలోచనశక్తి పెరుగుతుంది. తెలివితేటలు వృద్ధి చెందుతాయి.

**గురువారం :** ఆయుష్షును, ఆరోగ్యాన్ని కోరేవారు తమ ఇష్టదైవానికి గురువారం రోజున పాలతో, నెయ్యితో చేసిన పదార్థాలను నివేదించాలి. వస్త్రాలను కూడా నివేదించి అర్చన చేయడం చాలా మంచిదని శాస్త్రాల ద్వారా తెలుస్తుంది.

**శుక్రవారం :** ఆరోజు కూడా ఇష్టదైవాన్ని శ్రద్ధతో ఆరాధించాలి. పూజానంతరం వేదపండితుల తృప్తి కోసం షడ్రుచులతో కూడిన భోజనాన్ని పెట్టాలి. స్త్రీల తృప్తి కోసం మంచి మంచి వస్త్రాలను బహూకరించడం మంచిది. లలితా సహస్రనామం పఠించాలి. లేదా భక్తితో శ్రద్ధగా వినాలి. అమ్మవారి అనుగ్రహం కోసం కుంకుమ పూజ చేయాలి.

**శనివారం :** రుద్రాది దేవతల ఆరాధన మంచిది. అపమృత్యువు నుంచి తప్పించుకోవాలనుకునేవారు ఆనాడు నువ్వులతో హోమం చేసి నువ్వులను దానం ఇచ్చి నువ్వులు కలిపిన అన్నంతో పండితులకు భోజనం పెట్టాలి. ఇలా చేయటం వల్ల పూజ చేసిన వ్యక్తికి మంచి ఆరోగ్యం చేకూరుతుంది. శని దోష పూజాది కార్యక్రమాలు కూడా చేయాలి. పేదలకు అన్నదానం చేయాలి. కాకులకు ఆహారం పెట్టడం వలన పితృదేవతలు అనుగ్రహం కలుగుతుంది.

## సిమ్లా నుంచి బాలీవుడ్ వరకు.. 'లాపతా లేడీస్'తో సత్తా చాటుతున్న ప్రతిభా రాంటా




సిమ్లా కొండల్లో పుట్టి పెరిగిన అమ్మాయి. సినిమాలంటే చిన్నప్పటి నుంచే ఆసక్తి. నటి కావాలన్నది చిన్ననాటి కల. అయితే ఆ కలను వృత్తిగా మార్చుకోవాలంటే ముందుగా కుటుంబాన్ని ఒప్పించాలి. ఆ తర్వాత ముంబైలో తనను తాను నిరూపించుకోవాలి. ఈ రెండు దశలను దాటిన ప్రతిభా రాంటా.. ఇప్పుడు హిందీ చిత్ర పరిశ్రమలో గుర్తింపు పొందుతున్న యువ నటిగా నిలిచింది. టెలివిజన్‌తో మొదలైన ఆమె ప్రయాణం 'లాపతా లేడీస్'తో కీలక మలుపు తిరిగింది. ఆ తర్వాత 'హీరామండి: ది డైమండ్ బజార్', 'ది రివల్యూషనరీస్' వంటి ప్రాజెక్టులతో విభిన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతోంది.సినిమాలపై ఆసక్తి ప్రతిభకు చిన్నతనంలోనే ఏర్పడింది. తండ్రితో కలిసి సినిమాలు చూడటం, పాటలకు నృత్యం చేయడం ఆమె బాల్యంలో భాగం. పాఠశాల కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనేది. నెమ్మదిగా నటనపై ఆసక్తి పెరిగింది. తనకు నటి కావాలన్న విషయం మాత్రం చాలా ముందుగానే స్పష్టమైందని ప్రతిభ పలు ఇంటర్వ్యూల్లో చెప్పింది. సిమ్లాలోని కాన్వెంట్ ఆఫ్ జీసస్ అండ్ మేరీ పాఠశాలలో చదువుకున్న ఆమె.. ఆ తర్వాత ముంబైలో ఫిల్మ్‌మేకింగ్ చదువుకుంది. నటిగా మారాలన్న ఆలోచనకు కుటుంబం మొదట పూర్తిగా మద్దతు ఇవ్వలేదు. సినిమా రంగంలో స్థిరపడటం ఎంత కష్టమో వారికి తెలుసు. అయినా ప్రతిభ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. 2019లో ముంబైకి వెళ్లిన ప్రతిభకు ఆ నగరం పూర్తిగా కొత్త. చదువుతో పాటు ఆడిషన్లు ఇవ్వడం మొదలుపెట్టింది. కొత్త వ్యక్తులను కలవడం, అవకాశాల కోసం ప్రయత్నించడం, తిరస్కరణలను ఎదుర్కోవడం.. ఇవన్నీ ఆమె కెరీర్ తొలి దశలోనే ఎదురయ్యాయి. కుటుంబం కూడా ఆమెకు ఒక గడువు పెట్టినట్లు ప్రతిభ చెప్పింది. నిర్ణీత సమయంలో అవకాశం రాకపోతే తిరిగి రావాల్సి ఉంటుందని చెప్పారట. ఆ ఒత్తిడి మధ్యే ఆమె ప్రయత్నాలు కొనసాగించింది. చివరకు టెలివిజన్‌లో అవకాశం దక్కింది.

**టెలివిజన్‌తో నటనకు పునాది**

'కుర్బాన్ హువా' సీరియల్‌తో ప్రతిభ టెలివిజన్‌లోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత 'ఆధా ఇష్క్'లో కనిపించింది. రోజువారీ షూటింగ్ షెడ్యూల్, వేగంగా సన్నివేశాలు పూర్తి చేయాల్సిన పరిస్థితి ఆమెకు కెమెరా ముందు పనిచేయడంపై మంచి అవగాహన ఇచ్చాయి. టెలివిజన్ తనకు నటనలో ఒక రకమైన శిక్షణగా పనిచేసిందని ప్రతిభ చెప్పింది. పాత్రను అర్థం చేసుకోవడం నుంచి కెమెరా ముందు సహజంగా ఉండటం వరకు చాలా విషయాలు అక్కడే నేర్చుకుంది. ఈ అనుభవమే తర్వాత సినిమాల్లో ఆమెకు ఉపయోగపడింది.

**'లాపతా లేడీస్'తో మలుపు**

కిరణ్ రావు దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్' ప్రతిభ కెరీర్‌ను పూర్తిగా మార్చింది. జయ పాత్ర కోసం ఆడిషన్ ఇచ్చిన ఆమె.. పలుదశల ఎంపిక తర్వాత ఆ పాత్రను దక్కించుకుంది. ఆమిర్ ఖాన్ నిర్మించిన ఈ చిత్రంలో స్పర్శ్ శ్రీవాస్తవ్, నితాన్షి గోయల్‌తో కలిసి నటించింది. సినిమాలో పెళ్లి తర్వాత తన జీవితంపై ప్రశ్నలు వేసుకుంటూ, తన భవిష్యత్తును తానే నిర్మించుకోవాలనుకునే యువతిగా జయ కనిపిస్తుంది. పాత్రలోని పట్టుదల, అమాయకత్వం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిభ సహజంగా తెరపైకి తీసుకొచ్చింది. జయ పాత్రతో తనకు కొన్ని వ్యక్తిగత పోలికలు ఉన్నాయని ఆమె చెప్పింది. తన భవిష్యత్తు గురించి కుటుంబంతో భిన్నమైన ఆలోచన ఉన్నప్పటికీ నటనను ఎంచుకుని ముంబైకి వచ్చిన తన ప్రయాణం.. జయ పాత్రను అర్థం చేసుకోవడంలో ఉపయోగపడిందని వివరించింది. 'లాపతా లేడీస్' విడుదల తర్వాత ప్రతిభ నటనకు ప్రశంసలు వచ్చాయి. ముఖ్యంగా కొత్త నటిగా ఆమె చూపించిన సహజత్వం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఒకే సినిమాతో వచ్చిన గుర్తింపు ఆమెకు మరిన్ని అవకాశాలకు దారితీసింది.

'ది రివల్యూషనరీస్'లో...

నిఖిల్ అద్వానీ రూపొందించిన 'ది రివల్యూషనరీస్'లో ప్రతిభకు మరో విభిన్న అవకాశం లభించింది. స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలోని ఈ కథలో ఆమె ప్రతిభా లాహిరీ పాత్ర పోషించింది. రోహిత్ సరాఫ్, భువన్ బామ్, గుర్‌ఫతేహ్ పిర్జాదా తదితరులతో కలిసి నటించింది. చారిత్రక నేపథ్యం ఉన్న పాత్ర కావడంతో ఆ కాలాన్ని, మహిళా విప్లవకారుల పాత్రను అర్థం చేసుకోవడానికి ఆమె సిద్ధమైంది. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నమైన బాడీలాంగ్వేజ్, ఆలోచనా విధానం అవసరమైన ఈ పాత్ర తనకు కొత్త సవాలుగా అనిపించిందని చెప్పింది.ప్రతిభ కెరీర్‌లో మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ 'విష్కన్య'. చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు ఆమె ఎంచుకున్న ప్రాజెక్టులను గమనిస్తే.. కథ, పాత్రల విషయంలో ప్రయోగాలు చేయడానికి ప్రతిభ సిద్ధంగా ఉందని కనిపిస్తోంది. సిమ్లాలో మొదలైన కల ముంబైలో కెరీర్‌గా మారింది. టెలివిజన్ ఆమెకు అనుభవాన్ని ఇచ్చింది. 'లాపతా లేడీస్' గుర్తింపును తీసుకొచ్చింది. ఇప్పుడు ఆ గుర్తింపును దాటి తన నటనా పరిధిని పెంచుకునే దిశగా ప్రతిభ అడుగులు వేస్తోంది.

**ఒకే ముద్రలో ఉండకుండా..**

తొలి సినిమా విజయాన్ని తన కెరీర్‌కు ఒకే నిర్వచనంగా మార్చుకోకుండా ప్రతిభ విభిన్న పాత్రలను ఎంచుకుంటోంది. సంజయ్ లీలా భన్సాలీ రూపొందించిన 'హీరామండి: ది డైమండ్ బజార్'లో కనిపించింది. ఆ తర్వాత వచ్చిన ప్రాజెక్టుల్లోనూ పాత్రకు ప్రాధాన్యం ఉన్న కథలను ఎంచుకునే ప్రయత్నం చేసింది. తనకు పూర్తిగా పరిపూర్ణంగా ఉండే పాత్రల కంటే లోపాలు, సంక్లిష్టతలు ఉన్న పాత్రలే ఆసక్తికరంగా అనిపిస్తాయని ప్రతిభ చెప్పింది. నటిగా కొత్త అనుభవాలను పొందాలంటే ఒకే రకమైన పాత్రలకు పరిమితం కాకూడదనేది ఆమె ఆలోచన.



# పిల్లల్లో కిడ్నీ రాళ్లు.. కారణాలేంటి? ఎందుకొస్తాయి? వస్తే ఏం చేయాలి?

పెద్దల్లోనే ఎక్కువనుకునే కిడ్నీ రాళ్ల సమస్య ఇటీవల పిల్లల్లోనూ పెరిగిపోతోంది. పుట్టుకతో వచ్చే లోపాలు, జన్యుపరమైన అంశాలకు తోడు మారిపోతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు,, అపరిశుభ్రత, విటమిన్ల లోపం వంటివెన్నో దీనికి ఆజ్యం పోస్తున్నాయి. పెద్దవారికైనా, పిల్లలకైనా కిడ్నీ రాళ్ల బాధ ఒకటే గానీ చిన్నారుల్లో దీన్ని గుర్తించటం కాస్త కష్టం. నొప్పి ఎక్కడ్నుంచి వస్తోందో, ఎటు నుంచి ఎటు వెళ్తోందో పిల్లలు సరిగా చెప్పలేరు. ఈ నేపథ్యంలో పిల్లల్లో కిడ్నీ రాళ్లు , వాటితో కలిగే నష్టాలు, నివారణ మార్గాల గురించి తెలుసుకొని ఉండటం ఎంతైనా అవసరం.

## ఎక్కడివీ రాళ్లు?

కిడ్నీలో రాళ్లు ఎక్కడో బయటి నుంచి వచ్చి చేరేవి కావు. లోపల తయారయ్యేవే. నీటిలో బాగా ఉప్పు వేసి మరిగించారనుకోండి. కొంతసేపటికి నీరంతా ఇగిరిపోయి.. గిన్నెలో ఉప్పు రాళ్లు ఏర్పడతాయి కదా. కిడ్నీ రాళ్లూ ఇలాగే తయారవుతాయని అనుకోవచ్చు. వీటికి మూలం- మూత్రంలో క్యాల్షియం, ఆక్సలేట్, యూరిక్ ఆమ్లం వంటి లవణాలు, ఖనిజాలు, రసాయనాల స్థాయిలు పెరగటం. దీంతో మూత్రం చిక్కబడుతుంది. క్రమంగా దానిలోని లవణాలు, రసాయనాలన్నీ చిన్న చిన్న స్ఫటికాలుగా గూడుకట్టుకోవటం ఆరంభిస్తాయి. ఇవి మొదట్లో కిడ్నీలో మూత్రం నిల్వ ఉండే వ్యవస్థలో పోగుపడి.. లోపలి పైపొర మీద అంటుకుంటాయి. దాని మీద మరొక స్ఫటికం.. దానిపై మరోటి.. ఇలా చేరుకుంటూ వచ్చి, చివరికి రాళ్ల మాదిరిగా గట్టిపడిపోతాయి.

## లక్షణాలు

నొప్పి, మంట: మూత్రనాళం ఒంపుల్లో రాళ్లు చిక్కుపడితే తీవ్రమైన నొప్పి తలెత్తుతుంది. నొప్పి నడుం దగ్గర పక్కలవైపు మొదలై.. గజ్జల వరకూ పాకుతుంది. మూత్రం పోస్తున్నప్పుడు మంట పుట్టొచ్చు. చిక్కేంటంటే- నొప్పి పుడుతున్నా పిల్లలు ఎక్కడ్నుంచి వస్తుందో సరిగ్గా చెప్పలేకపోవటం. నొప్పి ఎక్కడ్నుంచి వస్తుందని అడిగితే కడుపు చూపిస్తారు. దీంతో ఒక్కోసారి అపెండిక్స్ వాపుగానూ పొరపడొచ్చు.

మూత్రం సరిగా రాకపోవటం: ముఖ్యంగా మూత్రనాళంలో గానీ మూత్రమార్గంలో గానీ రాయి చిక్కుపడితే మూత్రం పోయటానికి ఇబ్బంది పడతారు. కొన్నిసార్లు మూత్రంలో రక్తం కనపడొచ్చు.

వాంతి, వికారం: సమస్య తీవ్రంగా ఉంటే వాంతి, వికారం వేధిస్తుంటాయి.

తరచూ మూత్రం: పిల్లలు తరచుగా మూత్రం పోస్తుంటారు. కొంతమంది మగపిల్లలు అదేపనిగా అంగాన్ని పట్టుకొని లాగుతుంటారు.

**జ్వరం:** మూత్రం నిల్వ ఉండటం వల్ల ఇన్ఫెక్షన్ తీవ్రమైతే జ్వరం, చలి, బలహీనత ముంచుకురావొచ్చు. మూత్రం చెడువాసన కొట్టొచ్చు.

## దుష్పరిణామాలతో జాగ్రత్త!

కిడ్నీ రాళ్లు ఇతరత్రా దుష్ప్రభావాలకూ దారితీస్తాయి.

మూత్రనాళంలో అడ్డంకి మూలంగా మూత్రం వెనక్కి వెళ్లిపోయి కిడ్నీ వాపు (హైడ్రోనెఫ్రోసిస్) తలెత్తొచ్చు. చివరికిది కిడ్నీ దెబ్బతినటానికీ దారితీయొచ్చు.

మూత్రాశయంలో మూత్రం ఎక్కువసేపు నిల్వ ఉంటే దీర్ఘకాల ఇన్ఫెక్షన్ (సిస్టైసిస్) రావొచ్చు.

మూత్రనాళం సంకోచించటం వల్ల ఇతర అవయవాలకు దారులు (ఫిస్ట్యులా) ఏర్పడొచ్చు.

మూత్రాశయం ఉబ్బిపోయి తరచూ మూత్రం రావొచ్చు.

## ప్రధానంగా నాలుగు రకాలు

కిడ్నీ రాళ్లలో ప్రధానంగా నాలుగు రకాలు కనబడుతుంటాయి.

క్యాల్షియం రాళ్లు: మూత్రంలో క్యాల్షియం, ఆక్సలేట్, యూరియా మోతాదులు అధికంగా.. సిట్రేట్ చాలా తక్కువగా ఉండడం వల్ల ఇవి ఏర్పడతాయి.

స్ట్రువైట్ రాళ్లు: వీటికి మూలం దీర్ఘకాల మూత్ర ఇన్ఫెక్షన్లు. ఇన్ఫెక్షన్ కారక బ్యాక్టీరియా మూత్రంలో రసాయనాల స్థాయిలను అస్తవ్యస్తం చేయటం వల్ల ఇవి పుట్టుకొస్తాయి.

యూరిక్ ఆమ్లం రాళ్లు: మూత్రంలో ఆమ్ల గుణం పెరిగినప్పుడు యూరిక్ ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇది స్ఫటికాలుగా మారి రాళ్లు ఏర్పడతాయి.

**సిస్టిన్ రాళ్లు:** జన్యుపరంగా కొందరికి రక్తంలోని సిస్టిన్ రసాయనం సరిగా బయటకు వెళ్లిపోదు. ఫలితంగా దీని మోతాదులు పెరిగి రాళ్లుగా మారుతుంటాయి.

## కారణాలు ఎన్నెన్నో..

పుట్టుకతో వచ్చే మూత్రకోశ లోపాల దగ్గర్నుంచి విటమిన్ల లోపం, ఆహార అలవాట్ల వరకూ ఎన్నెన్నో కారణాలు కిడ్నీరాళ్లకు దారితీయొచ్చు.

జన్యుపరంగా: కొందరికి జన్యుపరంగా మూత్రంలో సిస్టిన్ ఎక్కువగా పోవటం రాళ్లకు దారితీయొచ్చు.

మూత్రం ఆపుకోవటం: టీవీ చూస్తూనో, ఆటల్లో మునిగిపోయో కొందరు చాలాసేపు మూత్రం ఆపుకొంటూ ఉంటారు. ఇలా మూత్రం నిల్వ ఉంటే ఇన్ఫెక్షన్లు రావొచ్చు. లవణాలు పెద్దమొత్తంలో పేరుకుపోవచ్చు. ఇవి రెండూ రాళ్లకు దారితీసేవే.

నీటిశాతం తగ్గటం: పిల్లలు ఏదో వ్యాపకంలో మునిగిపోయి నీళ్లు తాగటం మరచిపోతుంటారు. కొందరికి చిన్నపేగుల్లో ఇన్ఫెక్షన్ల మూలంగానూ ద్రవాలు సరిగా గ్రహించక ఒంట్లో నీటిశాతం తగ్గొచ్చు. దీంతో మూత్రం గాఢంగా, చిక్కగా తయారై.. రాళ్లు ఏర్పడే ప్రమాదముంది.

ఉప్పు ఎక్కువగా తినటం: ప్రస్తుతం జంక్ఫుడ్ తినటం ఎక్కువైంది. పేద కుటుంబాల్లో పచ్చళ్ల వంటివి తినటమూ ఎక్కువే. వీటిల్లో ఉప్పు (సోడియం) పెద్దమొత్తంలో ఉంటుంది. సోడియంతో మూత్రంలో క్యాల్షియం మోతాదులు పెరిగిపోయి రాళ్లకు దారితీయొచ్చు.

యూరిక్ ఆమ్లం పెరగటం: జంతువుల ప్రోటీన్ మూలంగా యూరిక్ ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. మూత్రంలో దీని మోతాదులు పెరిగిపోయి రాళ్లు ఏర్పడొచ్చు. మూత్రంలో ఎక్కువ ఆమ్ల స్వభావం ఉన్నా ఇవి ఏర్పడొచ్చు.

మూత్రనాళం ఇరుకు: కొందరికి పుట్టుకతో మూత్రనాళంలో కొన్నిచోట్ల సన్నగా, ఇరుకుగా ఉంటుంది. కొందరికి కిడ్నీ, మూత్ర నాళం కలుసుకునే చోట అడ్డంకి ఉండొచ్చు. దీంతో మూత్రం కిందికి సరిగా వెళ్లక, ఎక్కువసేపు నిల్వ ఉండటం వల్ల ఇన్ఫెక్షన్లు.. ఫలితంగా రాళ్లు ఏర్పడొచ్చు.

**ఊబకాయం:** ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. దీంతో మూత్రంలో క్యాల్షియం మోతాదులూ ఎక్కువవుతాయి. ఇది రాళ్ల ముప్పు పెరిగేలా చేస్తుంది.

కొన్ని మందులు: అసిటిజోలమైడ్, యాంటాసిడ్లు, గ్లూకోకార్టికాయిడ్ల వంటి మందులూ రాళ్లకు దారితీయొచ్చు. మూర్ఛతో బాధపడేవారు ఎక్కువగా మందులు తీసుకోవటమూ కారణం కావొచ్చు.

వెన్నుపాము లోపాలు: వెన్నుపాము లోపాలతో పుట్టిన పిల్లల్లో మూత్రాశయం సరిగా పనిచేయకపోవటం మూలంగా మూత్రం ఎక్కువసేపు అక్కడే ఉండిపోయి రాళ్లు ఏర్పడొచ్చు.

నివసించే ప్రదేశం: భూగర్భంలో 'కఠిన జలం' ఉన్న ప్రాంతాల్లో నివసించేవారికి కిడ్నీ రాళ్లు వచ్చే అవకాశం ఎక్కువ.

పేదరికం: పేద పిల్లలకు కిడ్నీ రాళ్ల ముప్పు ఎక్కువ. దీనికి ప్రధాన కారణం అపరిశుభ్రత, సరైన పోషకాహారం తీసుకోకపోవటం.

విటమిన్ ఎ లోపం: విటమిన్ ఎ లోపం మూలంగా మూత్రాశయం లోపలి గోడ పొరలు పొరలుగా ఊడుతుంటుంది. వీటిల్లో ఏదైనా పొర ఎక్కడైనా స్థిరపడితే దాని చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయి చివరికి రాయిగా మారుతుంది.

## నిర్ధారణజి

నొప్పి, మూత్రం మంట వంటి లక్షణాలతోనే కిడ్నీ రాళ్లను అనుమానిస్తారు. రాళ్లు ఉన్నట్టు అనిపిస్తే తగు పరీక్షలు చేసి నిర్ధారణ చేయాల్సి ఉంటుంది.

ఎక్స్రే: ఇది ప్రధానమైన పరీక్ష. మూత్రకోశం ఎక్స్రే తీస్తే రాళ్లు ఎక్కడున్నాయనేది తెలుస్తుంది. 80% వరకు రాళ్లు ఎక్స్రేలోనే కనపడతాయి. అవసరమైతే అల్ట్రాసౌండ్, సీటీస్కాన్ పరీక్షలూ చేయాల్సి వస్తుంది. వీటితో రాయి ఉందా లేదా? ఉంటే ఎక్కడుంది? మూత్రపిండాలు ఎలా పనిచేస్తున్నాయి? ఎక్కడైనా ఉబ్బాయా? అనేవి బయటపడతాయి.

మూత్రపరీక్ష: రసాయనాలు, లవణాల మోతాదులు.. ఇన్ఫెక్షన్ కారక బ్యాక్టీరియా ఇందులో తెలుస్తాయి.

మూత్ర పరిమాణం: పిల్లల విషయంలో 24 గంటల వ్యవధిలో మూత్రం ఎంత వస్తోందనేది చూడటం చాలా ముఖ్యం. థైరాయిడ్ పరీక్ష: అవసరమైతే పారాథైరాయిడ్ గ్రంథి పనితీరు పరీక్ష చేస్తారు.

## చికిత్స- రాయిని బట్టి..

చిన్న చిన్న రాళ్లు వాటంతటవే బయటకొచ్చేస్తాయి. కొన్నిసార్లు ఇవి మూత్రనాళంలో, మూత్రమార్గంలో చిక్కుకొని పోవచ్చు. కొన్ని రాళ్లు.. ముఖ్యంగా ఆక్సలేట్ రకం రాళ్లు కిడ్నీ లోపలి పొర కణజాలానికి కరచుకొని అలాగే ఉండిపోతుంటాయి. పెద్దగానూ అవుతుంటాయి. అందువల్ల రాయి పరిమాణం, అది ఎక్కడుంది? ఇతరత్రా ఇబ్బందులేంటి? అనేవి దృష్టిలో పెట్టుకొని చికిత్స చేయాల్సి ఉంటుంది.

## చిన్నరాళ్లకు..

సాధారణంగా 3-5 మి.మీ. సైజు రాళ్ల విషయంలో పెద్దగా కంగారు పడాల్సిన పనిలేదు. పిల్లలు నీళ్లు ఎక్కువగా తాగేలా చూసుకుంటే క్రమంగా బయటకు వచ్చేస్తాయి. అదే రాయి కాస్త పెద్దగా (5-8 మి.మీ.) ఉందనుకోండి. మూత్రపిండాలు సరిగా పనిచేస్తూ.. పెద్దగా వాపు, నొప్పి లేవనుకోండి. ఇలాంటి పరిస్థితుల్లో నొప్పి మాత్రలు, నార్కొటిక్స్తో మంచి ఉపశమనం లభిస్తుంది. వాంతి, వికారం తగ్గటానికి తగు మందులు వాడుకోవాల్సి ఉంటుంది.

## పెద్దరాళ్లకు..

రాళ్లు 8 మి.మీ. కన్నా పెద్దగా ఉండి.. మూత్రపిండాల పనితీరు దెబ్బతింటూ.. తీవ్రమైన నొప్పి (రీనల్ కోలిక్), జ్వరం వేధిస్తున్నట్టయితే వెంటనే రాళ్లను బయటకు తీయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆపరేషన్ అవసరం లేకుండానే రాళ్లను తొలగించే పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.

ఎక్స్ట్రాకార్పొరల్ షాక్ వేవ్ లిథోట్రిప్సీ: ఇందులో బయటి నుంచి శబ్ద లేదా షాక్ తరంగాల సాయంతో రాళ్లను పగలగొడతారు. దీంతో అవి ముక్కలు ముక్కలై మూత్రం ద్వారా పడిపోతాయి. ముక్కలు లోపల చిక్కుకోకుండా మూత్రనాళంలో స్టెంట్ అమర్చుతారు. దీంతో అవి తేలికగా బయటకు వచ్చేస్తాయి. ఈ చికిత్సకు సుమారు 45 నిమిషాలు పడుతుంది.

యురెతెరోస్కోపిక్ పద్ధతి: మూత్రనాళంలో రాయి చిక్కుకున్నవారికిది ఉపయోగపడుతుంది. ఇందులో మూత్రమార్గం ద్వారా యురెతొరోస్కోపీని లోపలికి పంపించి రాయిని తీయొచ్చు లేదా పగలగొట్టొచ్చు.

ఆపరేషన్: 2 సెం.మీ. కన్నా ఎక్కువుండే రాళ్లకు కీహోల్ విధానంలో చిన్న రంధ్రం చేసి లోపలికి వెళ్లి రాయిని ముక్కలు చేయాల్సి ఉంటుంది. కిడ్నీలో మూత్రనాళం కలిసే చోట ఏర్పడే రాళ్లు (స్టాగ్హార్న్) కదలకుండా అక్కడే అతుక్కుపోతాయి. ఇలాంటివాటిని చిన్న కోతతో నెఫ్రోలిథాటమీ పద్ధతిలో ఆపరేషన్ చేసి తీస్తారు.

## నివారణ ఉత్తమం

నీళ్లు, ద్రవాలు ఎక్కువగా తీసుకునేలా చూడాలి.

కూల్డ్రింకుల వంటి వాటికి దూరంగా ఉంచటం మంచిది.

ఉప్పు, కొవ్వులు మితంగా తినేలా చూసుకోవాలి.

రోజూ తప్పకుండా ఆరుబయట ఆటలు ఆడేలా ప్రోత్సహించాలి.

రాళ్లు ఏర్పడే స్వభావం ఉన్న పిల్లలకు టమోటా, క్యాబేజీ, పాలకూర తక్కువగా ఇవ్వాలి.

# పిత్తాశయ రాళ్లకు పథ్యం



పిత్తాశయ రాళ్ల లక్షణాలు అదుపులో ఉండటంలో ఆహారం ముఖ్యపాత్ర పోషిస్తుంది. అప్పటికే ఉన్న రాళ్లు కరగవు కానీ సరైన పదార్థాలను ఎంచుకుంటే కడుపుబ్బరం, వికారం, అజీర్ణం, నొప్పి వంటి ఇబ్బందులు తగ్గటానికి తోడ్పడుతుంది. ప్రధానంగా పీచుతో కూడిన పదార్థాలు, తేలికగా అరిగే ప్రొటీన్లు, నిండు గింజ ధాన్యాలు, మితంగా ఆరోగ్యకర కొవ్వులు తీసుకోవటం మేలు చేస్తుంది.

ఇవి మేలు

యాపిల్, నారింజ, బత్తాయి, అరటి వంటి తాజా పండ్లు.

ఆకు కూరలు, క్యారెట్, చిక్కుళ్లు, బ్రోకలీ, క్యాబేజీ వంటి కూరగాయలు.

దంపుడు బియ్యం, నిండు గోధుమ బ్రెడ్డు, బార్లీ, తృణధాన్యాలు.

స్కిన్లెస్ చికెన్, చేపలు, బీన్స్, పప్పు దినుసులు.

వెన్న తీసిన పాలు, పెరుగు.

అవకాడో, గింజ పప్పులు, విత్తనాలు, ఆలివ్ అయిల్ వంటివి మితంగా.

- వీటితో పీచు, ఇతర పోషకాలు, మంచి ప్రొటీన్ లభిస్తాయి.

**తినకూడనివి, తగ్గించాల్సినవి**

సంతృప్త కొవ్వు ఎక్కువగా ఉండే పదార్థాలు, వనస్పతి వంటి ట్రాన్స్ ఫ్యాట్, అతిగా శుద్ధిచేసిన పదార్థాలకు దూరంగా ఉండటం మంచిది.

తగ్గించుకోవాల్సినవి లేదా పూర్తిగా మానెయ్యాల్సినవి ఇవీ..

సమోసాలు, పకోడీ, వేయించిన చికెన్, వేపుళ్లు.

కొవ్వు ఎక్కువగా ఉండే మాంసం.

వెన్నతో కూడిన పాల పదార్థాలు.

వెన్న, నెయ్యి, పెద్దమొత్తంలో ఐస్క్రీమ్.

కేకులు, పేస్ట్రీలు, చిప్స్, అధిక కొవ్వుతో కూడిన బేకరీ పదార్థాలు.

మరీ ఎక్కువ నూనె పోసి వండే వంటకాలు.

ఎక్కువ కొవ్వుతో కూడిన తీపి పదార్థాలు.

**అధిక కొవ్వుతో చిక్కు ఇలా..**

మనం ఆహారం ద్వారా తీసుకున్న కొవ్వు పదార్థాలు జీర్ణం కావటానికి పిత్తాశయం పైత్యరసాన్ని విడుదల చేస్తుంటుంది. ఒకేసారి పెద్దమొత్తంలో కొవ్వు పదార్థాలు తీసుకుంటే పిత్తాశయం సంకోచించి, కొందరిలో నొప్పి తలెత్తే అవకాశముంది. అలాగని పిత్తాశయ రాళ్లు గలవారు కొవ్వు పదార్థాలు మొత్తంగా మానెయ్యాలని కాదు. శరీరం సక్రమంగా పనిచేయటానికి, కొన్ని రకాల పోషకాలను శోషించుకోవటానికి కొంత కొవ్వు అవసరం. కాబట్టి సమతులాహారం తీసుకుంటూనే అధిక, అనారోగ్య కొవ్వును తగ్గించుకునేలా చూసుకోవటం ముఖ్యం. అలాగే..

వేళకు భోజనం చేయాలి. మరీ ఎక్కువసేపు కడుపు మాడ్చుకోవద్దు.

కడుపు నిండా తింటే ఇబ్బంది అనిపిస్తుంటే తక్కువ తక్కువగా ఎక్కువసార్లు తినాలి.

ఒకేసారి పీచు పదార్థాలు ఎక్కువగా తింటే గ్యాస్ మరీ ఎక్కువగా ఉత్పత్తి కావొచ్చు. కడుపు ఉబ్బరానికి దారితీయొచ్చు. కాబట్టి పీచు మోతాదు క్రమంగా పెంచుకుంటూ రావాలి.

వేపుళ్లకు బదులు నీటితో లేదా ఆవిరితో ఉడికించినవి తినాలి.

రోజంతా తగినంత నీరు తాగాలి.

కఠినమైన ఆహార నియమాలతో మరీ వేగంగా బరువు తగ్గించుకోవద్దు. జీవనశైలి మార్పులతో నెమ్మదిగా బరువు తగ్గించుకోవాలి.

## వైభవ్ సూర్యవంశీకి నో ఛాన్స్.. వెస్టిండీస్‌తో తొలి T20కి ప్లేయింగ్ XI ఇదే!






**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా.. ఇప్పుడు 5 మ్యాచ్‌ల ౨20 సిరీస్‌కు సిద్ధమైంది. పొట్టి ఫార్మాట్‌లో జరగనున్న ఈ సిరీస్ అక్టోబర్ 6వ తేదీ నుంచి లక్నోలోని ఏకనా క్రికెట్ స్టేడియం దీ గ్రౌండ్‌లో ప్రారంభం కానుంది. ఇటీవల జపాన్ వేదికగా ముగిసిన 2026 ఆసియా క్రీడలలో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు స్వర్ణ పతకం సాధించి అజేయ ఊపు మీదుంది. ఆసియా గేమ్స్ లో వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో ఆడిన ఈ యువ జట్టు, ఇప్పుడు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆధ్వర్యంలో విండీస్‌తో తలపడనుంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా పేస్ స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌కు దూరంగా ఉంది.

**తొలి T20I కోసం పుజారా ప్లేయింగ్ XI ఇదే:**

ఈ నేపథ్యంలో వెస్టిండీస్‌తో జరగబోయే తొలి ౨20 మ్యాచ్ కోసం టీమిండియా మాజీ బ్యాటర్ ఛటేశ్వర్ పుజారా స్టార్ స్పోర్ట్స్ కోసం తన ప్లేయింగ్ ఎలెవెన్‌ను ప్రకటించాడు. ఆసియా క్రీడల్లో అద్భుత ప్రదర్శన చేసిన యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీని పుజారా తన తుది జట్టు నుంచి పక్కన పెట్టి బెంచ్‌కే పరిమితం చేశారు.

ఓపెనర్లుగా వికెట్ కీపర్ సంజు శాంసన్, అభిషేక్ శర్మలకు పుజారా చోటు కల్పించారు. ఇక మూడో స్థానంలో ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లను ఎంచుకున్నారు. మిగతా బ్యాటింగ్ ఆర్డర్‌లో తిలక్ వర్మ (5), శివమ్ దూబే (6), ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (7) స్థానం సంపాదించారు.

స్పిన్ విభాగంలో అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్‌లకు చోటు దక్కగా.. పేస్ అటాక్‌లో అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు యువ ఆటగాడు ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం ఇచ్చారు. అయితే ఆశ్చర్యకరంగా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు పుజారా తన తుది జట్టులో చోటు కల్పించలేకపోయాడు.

వెస్టిండీస్‌తో జరిగే తొలి ౨20 కోసం నా ప్లేయింగ్ ఎలెవెన్ ఇదే: సంజు శాంసన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా వస్తారు. నం.3లో ఇషాన్ కిషన్, నం.4లో శ్రేయస్ అయ్యర్, నం.5లో తిలక్ వర్మ, నం.6లో శివమ్ దూబే, నం.7లో నితీశ్ కుమార్ రెడ్డి, నం.8లో అక్షర్ పటేల్, నం.9లో కుల్దీప్ యాదవ్, నం.10గా అర్ష్‌దీప్ సింగ్, నం.11గా ప్రిన్స్ యాదవ్ ఉంటారని పుజారా పేర్కొన్నారు.

**తొలి T20 ప్లేయింగ్ ఎలెవెన్:**

సంజు శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్.

# ఈ స్వర్ణం తేలిగ్గా రాలేదు.. వారి అనుభవమే మా విజయానికి కారణమైంది: సంజూ శాంసన్

**ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్న భారత పురుషుల క్రికెట్ జట్టు**

**ఈ స్వర్ణం తేలిగ్గా రాలేదని వ్యాఖ్యానించిన సంజూ శాంసన్**

**అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉండటమే విజయానికి కారణమని వెల్లడి**

**ఫైనల్ ఒత్తిడిని అధిగమించడంలో సీనియర్లు కీలకపాత్ర పోషించారన్న సంజూ**






**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత జట్టు స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. ఉత్కంఠభరిత ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే, ఈ స్వర్ణం తమకు సులభంగా దక్కలేదని, దీనికోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందని భారత వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ అన్నాడు. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో కూడిన 'ఏ' టీమ్‌ను బరిలోకి దించడం వల్లే పాకిస్థాన్‌తో ఫైనల్ మ్యాచ్‌లో ఒత్తిడిని అధిగమించగలిగామని స్పష్టం చేశాడు. ఈ విజయం అనంతరం సంజూ శాంసన్ మాట్లాడుతూ.. "మాది చాలా అనుభవజ్ఞులైన జట్టు. ప్రాక్టీస్, మ్యాచ్‌లు లేనప్పుడు కూడా మమ్మల్ని మేము ఎలా ప్రేరేపించుకోవాలో, శక్తిని ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు. ఆసియా క్రీడలకు 'ఏ' టీమ్‌ను తీసుకురావడం నిజంగా కలిసి వచ్చింది. పాకిస్థాన్‌తో ఫైనల్‌లో అదే జరిగింది. అందరికీ ఇది ఒక సరైన మ్యాచ్‌లా అనిపించింది" అని వివరించాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ అద్భుత అర్ధసెంచరీలతో రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కూడా గట్టిగానే పోరాడింది. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై దూకుడుగా ఆడి, చివరి వరకు మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చింది. అయితే, భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో పాకిస్థాన్ 6 వికెట్లు కోల్పోయి 192 పరుగులకే పరిమితమైంది.

"చివరకు ఒక మంచి మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. మేం 200 పరుగులు చేశాక పాకిస్థాన్‌కు ఛేజింగ్ కష్టమవుతుందని అనుకున్నాం. కానీ, వికెట్ బాగుండటంతో వాళ్లు కూడా బాగా ఆడారు. ప్రేక్షకులకు ఒక మంచి ఫైనల్ చూసే అవకాశం దక్కింది. ఈ స్వర్ణం మాకు సులభంగా దక్కలేదు. కష్టపడి సాధించాం కాబట్టే ఎక్కువ సంతృప్తినిచ్చింది. మేమంతా చాలా సంతోషంగా ఉన్నాం" అని సంజూ పేర్కొన్నాడు.

ఆసియా క్రీడల ఫైనల్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప అవకాశమని, అయితే ఆట ప్రారంభమయ్యాక పరిస్థితులకు అనుగుణంగానే ఆడామని, ఒత్తిడిని దరిచేరనీయలేదని సంజూ స్పష్టం చేశాడు.

## నేను సాధించలేకపోయాను.. రోహిత్ అయినా దాన్ని అందుకోవాలి: గవాస్కర్




**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ తో చివరి వన్డేలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అద్భుత ఫామ్‌తో 92 పరుగులు చేసినప్పటికీ, భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాత్రం అసంతృప్తి వ్యక్తం చేశాడు. సెంచరీకి కేవలం 8 పరుగుల దూరంలో రోహిత్ ఔట్ కావడం తనను నిరాశపరిచిందని అన్నాడు. రోహిత్ శర్మ తన కెరీర్‌ను ఓ ప్రత్యేకమైన మైలురాయితో ముగించాలని తాను కోరుకుంటున్నట్లు గవాస్కర్ ఒక ఆసక్తికర లక్ష్యాన్ని నిర్దేశించాడు. జియోస్టార్‌లో ప్రసారమైన 'హయర్ క్రికెట్ లైవ్' కార్యక్రమంలో గవాస్కర్ మాట్లాడుతూ.. "2027 వన్డే ప్రపంచకప్ తర్వాత సుమారు 40 ఏళ్ల వయసులో రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉంది. నా వ్యక్తిగత కోరిక ఏంటంటే.. అతను రిటైర్ అయ్యే నాటికి అతని వయసు కన్నా ఎక్కువ వన్డే సెంచరీలు చేయాలి. ప్రస్తుతం రోహిత్ ఖాతాలో 35 సెంచరీలు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో శతకం పూర్తి చేసి ఉంటే, ఆ సంఖ్య 36కు చేరేది. తద్వారా 40 సెంచరీల మార్క్‌కు మరింత దగ్గరయ్యేవాడు" అని అభిప్రాయపడ్డాడు. ఈ సందర్భంగా తన కెరీర్‌లోని చివరి దశను గవాస్కర్ గుర్తుచేసుకున్నాడు. "నాకు 38 ఏళ్ల వయసులో, టెస్టుల్లో 38 సెంచరీలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. కానీ దురదృష్టవశాత్తు మూడుసార్లు 90ల్లో ఔటయ్యాను. అందుకే రోహిత్ సెంచరీ మిస్ కావడం చూసి నిరాశ చెందాను. నేను సాధించలేకపోయాను.. రోహిత్ అయినా ఆ ఘనత అందుకోవాలి" అని అభిలషించాడు. అదే సమయంలో 2023 ప్రపంచకప్ తర్వాత రోహిత్ బ్యాటింగ్ శైలిలో మార్పు వచ్చిందని గవాస్కర్ విశ్లేషించాడు. "ప్రపంచకప్‌లో మొదటి బంతి నుంచే దూకుడుగా ఆడేవాడు. ఇప్పుడు తన వికెట్‌కు ఎక్కువ విలువ ఇస్తున్నాడు. ఇది మంచి పరిణామమే. అయినా, రోహిత్‌ను నేను 30-40 పరుగులు చేసే ఆటగాడిగా కాకుండా, 'సెంచరీల వీరుడు'గానే చూస్తాను" అని స్పష్టం చేశాడు.

# మహేష్ బాబు పేరిట నమోదైన వరస్ట్ రికార్డులు ఏంటంటే.?

'రాజకుమారుడు' సినిమాతో తెలుగు సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నటుడు మహేష్ బాబు...మొదటి సినిమాతోనే ప్రిన్స్ గా తనకంటూ ఒక ట్యాగ్ ను ఏర్పాటు చేసుకున్నాడు. ఆ తర్వాత చేసిన సినిమాలతో కొంతవరకు మెప్పించినప్పటికి తన పూర్తిస్థాయి నట పోటెన్షియాల్టిని బయటికి తీసిన సినిమా మాత్రం 'నిజం' అనే చెప్పాలి. అందులో ఒక డీసెంట్ యాక్టింగ్ లో మహేష్ బాబు నటన చూసిన చాలా మంది మహేష్ బాబు గొప్ప నటుడు తను ఎలాంటి పాత్రనైనా సరే చేయగలడు అంటూ అతని గురించి గొప్పగా మాట్లాడారు. ఇక ఈ క్రమంలోనే 'ఒక్కడు' సినిమాతో ఆయన మాస్ లో తన ఫ్యాన్ ఫాలోయింగ్ ను విస్తరించుకున్నాడు. అలాగే తన కెరియర్ లోనే మొదటి బ్లాక్ బాస్టర్ సక్సెస్ ని సాధించాడు. పోకిరి, దూకుడు, శ్రీమంతుడు, భరత్ అనే నేను, మహర్షి లాంటి సినిమాలతో ఇండస్ట్రీ రికార్డులను క్రియేట్ చేశాడు. యావత్ తెలుగు సినిమా ప్రేక్షకులందరిని అలరించాడు. అలాంటి మహేష్ బాబు కెరియర్ లో కొన్ని వరస్ట్ రికార్డులు కూడా ఉన్నాయి. మహేష్ అభిమానులు వీటి గురించి మాట్లాడడానికి పెద్దగా ఇష్టపడరు. కానీ మహేష్ బాబు ఎవరినైతే నమ్మాడో వాళ్లే అతనికి వరస్ట్ రికార్డులను కట్టబెట్టారు. అప్పటినుంచి మహేష్ బాబు పూర్తి కథలను విని డేట్స్ ఇవ్వాలని బ్లైండ్ గా ఫిక్స్ అయ్యాడు. తమిళ్ సినిమా ఇండస్ట్రీలో తుపాకీ, కత్తి లాంటి వరుస బ్లాక్ బాస్టర్ సక్సెస్ లను







అందుకున్న మురుగదాస్ డైరెక్షన్లో నటించాలని ఉంది అంటూ మహేష్ బాబు ఒక ఇంటర్వ్యూలో ఓపెన్ గా చెప్పాడు. దాంతో మురుగదాస్ సైతం మహేష్ బాబు నిర్ణయానికి కట్టుబడి 'స్పైడర్' అనే సినిమాని మహేష్ బాబుతో చేద్దామని అతనికి కథను వినిపించాడు. కథ కూడా మహేష్ బాబు ఫైనల్ చేశాడు. మొత్తానికైతే మురుగదాస్ మీద పూర్తి నమ్మకంతో సినిమా ఎలా వస్తుంది ఏంటి అనే విషయాలను కూడా పట్టించుకోని మహేష్ బాబు తనను పూర్తిగా నమ్మాడు. దాంతో కథ విషయంలో కొన్ని మార్పులు చేర్పులు చేసిన మురుగదాస్ మొత్తానికైతే స్పైడర్ సినిమా రూపంలో మహేష్ బాబుకి ఒక భారీ డిజాస్టర్ ను కట్టబెట్టాడు. 120 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా దాదాపు 50 కోట్ల వరకు నష్టాన్ని మిగిల్చింది...

**బ్రహ్మోత్సవం**

'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాతో సక్సెస్ ని అందించిన శ్రీకాంత్ అడ్డాల తో మహేష్ బాబు మరో సినిమా చేయాలనుకున్నాడు. ఒక సినిమాతో తనకి సక్సెస్ ను అందించిన దర్శకుడిని మరోసారి రిపీట్ చేస్తూ మూవీ చేయడం మహేష్ కి అప్పట్లో ఆనవాయితీగా మారింది. కాబట్టి సీతమ్మ వాకిట్లో మూవీ తరువాత మరోసారి శ్రీకాంత్ అడ్డాలను సైతం కథ రెడీ చేసుకోమని చెప్పాడు. దాంతో 'బ్రహ్మోత్సవం' కథతో శ్రీకాంత్ మహేష్ బాబు దగ్గరికి వచ్చాడు. నిజానికి మహేష్ బాబు ఆ పూర్తి కథ కూడా వినకుండా కేవలం శ్రీకాంత్ అడ్డాల మీద ఉన్న నమ్మకంతోనే అతనికి సినిమా ఇచ్చాడు. నిజానికి బ్రహ్మోత్సవం సినిమాలో కథ ఏమీ ఉండదు. ఎంతసేపు రిలేషన్ షిప్స్ మీదనే సినిమాను నడిపించే ప్రయత్నం చేశాడు. కానీ అందులో కోర్ ఎలిమెంట్ ఏంటి అనే విషయాన్ని పర్ఫెక్ట్ గా చెప్పలేకపోయాడు. ఎమోషన్స్ సైతం పర్ఫెక్ట్ గా హ్యాండిల్ చేయడంలో దర్శకుడు పూర్తిగా విఫలమయ్యాడు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో బ్రదర్స్ మధ్య బాండింగ్ చాలా గొప్పగా చూపించిన దర్శకుడు బ్రహ్మోత్సవం సినిమా విషయంలో పూర్తిగా చేతులెత్తేశాడు. దానివల్ల ఈ సినిమా భారీ ఫ్లాప్ గా నిలిచింది. దాదాపు 40 కోట్ల వరకు ప్రొడ్యూసర్లకు నష్టాన్ని మిగిల్చింది...

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965